12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 2 సంచిక : 22 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : బాపట్ల ఆదివారం 27 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :2 ISSUE :22 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : BAPATLA SUN 27 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Bapatla,Ongole,Visakhapatnam,Kakinada,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur



## 10 శాతం వృద్ధి సాధ్యమే

### టెక్నాలజీపై నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు

- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో పెట్టుబడులతోనే దేశానికి ఉజ్వల భవిష్యత్తు
- ఏఐ, సెమీకండక్టర్లకు భారీగా నిధులు కేటాయించాలని సూచన
- చిన్న పరిశ్రమల్లోనూ ఏఐ వాడకం పెరగాలని వ్యాఖ్య

- మిగతా 2లో

## పాకిస్థాన్‌లో ఆత్మాహుతి దాడి.. 11 మంది మృతి



- పాకిస్థాన్‌లో పోలీసు చెక్‌పోస్ట్‌పై ఆత్మాహుతి దాడి
- ఈ ఘటనలో 11 మంది మృతి, 30 మందికి గాయాలు
- పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు వెల్లడి
- దాడికి బాధ్యత ప్రకటించుకున్న తెహ్రీక్-ఇ-తాలిబన్

- మిగతా 2లో



## కర్నూలులో ఏవియేషన్ అకాడమీ రావడం చరిత్రాత్మకం

- ఏవియేషన్ సెంటర్ ను ప్రారంభించిన ఓరియంట్ ఫ్లైట్స్ ఏవియేషన్ అకాడమీ
- పైలట్లకు డిమాండ్ విపరీతంగా పెరుగుతుందన్న మంత్రి
- ఓర్వకల్లులో డ్రోన్ సిటీ ఏర్పాటు చేయబోతున్నట్లు బీసీ జనార్దన్ ప్రకటన

- మిగతా 2లో

# భారీ వర్షాలతో ఉత్తరాంధ్ర అతలాకుతలం..

### అధికారులకు చంద్రబాబు కీలక ఆదేశాలు

- భారీ వర్షాలు, వరద పరిస్థితిపై సీఎం చంద్రబాబు సమీక్ష
- వేటకు వెళ్లలేని మత్స్యకార కుటుంబాలకు 50 కేజీల బియ్యం పంపిణీకి ఆదేశం
- ప్రకాశం బ్యారేజీకి ఎగువ, దిగువన కొత్త బ్యారేజీల నిర్మాణ ప్రతిపాదనలు
- తాజా వర్షాలతో రాష్ట్రంలోని జలాశయాల్లోకి 21 టీఎంసీల అదనపు నీరు
- రాష్ట్రంలో వర్షపాతం లోటు 50 శాతం నుంచి 31 శాతానికి తగ్గుదల



పెన్ పవర్ డెస్క్:గత కొద్దిరోజులుగా రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా ఉత్తరాంధ్రలో కురుస్తున్న భారీ వర్షాలు, వరద పరిస్థితిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలను ముమ్మరం చేయాలని, వేటకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్న మత్స్యకార కుటుంబాలకు తక్షణ సాయంగా 50 కేజీల బియ్యం అందించాలని ఆదేశించారు. అదే సమయంలో కృష్ణా నదిపై రెండు కొత్త బ్యారేజీల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను వేగవంతం చేయాలని అధికారులకు కీలక సూచనలు చేశారు. శనివారం జరిగిన ఈ సమీక్షలో అధికారులు రాష్ట్రంలోని తాజా పరిస్థితిని సీఎంకు వివరించారు. ఉత్తరాంధ్రలో నదులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయని, పలుచోట్ల నివాస ప్రాంతాలు, పంట పొలాలు నీట మునిగాయని తెలిపారు. సహాయక చర్యలపై ఆరా తీసిన ముఖ్యమంత్రి, ఎక్కడా ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాలని స్పష్టం చేశారు. ఐదు రోజులుగా సముద్రంలోకి వెళ్లలేని మత్స్యకారుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వారికి అండగా నిలవాలని, తక్షణమే బియ్యం పంపిణీ చేయాలని ఆదేశించారు.

**కృష్ణాపై కొత్త బ్యారేజీలు.. నీటి భద్రతపై దృష్టి**

ఈ సందర్భంగా స్థానికంగా కురుస్తున్న వర్షాల వల్ల ప్రకాశం బ్యారేజీకి వరద నీరు పెరుగుతోందని అధికారులు తెలపగా, ఆ నీటిని పూర్తిస్థాయిలో నిల్వ చేసుకునే మార్గాలపై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పులిచింతల-ప్రకాశం బ్యారేజీ మధ్య ఒకటి, ప్రకాశం బ్యారేజీకి దిగువన మరొకటి చొప్పున రెండు కొత్త బ్యారేజీల నిర్మాణం అవసరమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఈ రెండు ప్రాజెక్టులకు సంబంధించి గతంలో రూపొందించిన ప్రతిపాదనలను ముందుకు తీసుకెళ్లి, కేంద్ర ప్రభుత్వానికి పంపాలని అధికారులను ఆదేశించారు. అలాగే, హిర మండలం లిఫ్ట్ ప్రాజెక్టుకు విద్యుత్ సౌకర్యం కల్పించి, వంశధార నీటిని రిజర్వాయర్‌లోకి తరలించే పనులను వేగవంతం చేయాలని ఇరిగేషన్, విద్యుత్ శాఖల అధికారులకు సూచించారు.

- మిగతా 2లో

## ఈసీ ప్రకటనతో అపోహలకు తెరపడింది

- ఎన్నికల కమిషనర్ల మధ్య విభేదాలంటూ ప్రచారం
- ఢిల్లీలో కీలక సమావేశంతో క్లారిటీ ఇచ్చిన ఈసీ
- తమ మధ్య విభేదాలు లేవంటూ సంయుక్త ప్రకటన విడుదల
- సోషల్ మీడియాలో స్పందించిన ఏపీ సీఎం చంద్రబాబు
- రాజ్యాంగ సంస్థల సమగ్రతను, విశ్వసనీయతను గౌరవించాలని పిలుపు
- గెలుపోటములను హుందాగా స్వీకరించడమే నాయకత్వ లక్షణమని ఉద్ఘాటన



పెన్ పవర్ డెస్క్:భారత ఎన్నికల సంఘం (ఈసీఐ)లో కమిషనర్ల మధ్య విభేదాలు తలెత్తాయంటూ వచ్చిన వార్తలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించారు. ఇవాళ ఓ కీలక సమావేశం సందర్భంగా ఈసీ ఇచ్చిన ఏకగ్రీవ ప్రకటనతో అన్ని అపోహలకు తెరపడిందని ఆయన పేర్కొన్నరు. మన రాజ్యాంగ సంస్థల సమగ్రతను, విశ్వసనీయతను ఈ ప్రకటన మరోసారి స్పష్టం చేసిందని ఎక్స్ వేదికగా శనివారం ఆయన పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అంశంపై నెలకొన్న వివాదం

- మిగతా 2లో



## సీఎం విజయ్ నటనను ఇంకా ఆపలేదు: స్టాలిన్

- సీఎం విజయ్‌పై మాజీ సీఎం స్టాలిన్ తీవ్ర విమర్శలు
- ప్రజల ముందు విజయ్ నటన ఇంకా కొనసాగుతోందని ఎద్దేవా
- డీఎంకే పథకాలకే పేర్లు మార్చి అమలు చేస్తున్నారని ఆరోపణ
- సీఎం పదవికి తగిన హుందాతనం చూపాలని హితవు

- మిగతా 2లో

## కాంగ్రెస్‌తో కలవాలనే ఉద్దేశంతోనే జగన్ వైఖరి మార్చుకుంటున్నారా?

- ఓటర్ల జాబితా సవరణపై జగన్ ది ద్వంద్వ వైఖరి అంటూ ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు ఫైర్
- గతంలో కోర్టులో ఒకలా, ఇప్పుడు మరోలా మాట్లాడటమేంటని ప్రశ్న
- ఈసీల నియామకంపై మాట మార్చడం వెనుక ఆంతర్యమేమిటని నిలదీత
- 2029లో కాంగ్రెస్‌తో పొత్తు కోసమే జగన్ వ్యూహాలని ఆరోపణ

- మిగతా 2లో



## ఎన్నికల కమిషనర్ల మధ్య విభేదాలంటూ ప్రచారం..

### ప్రెస్ నోట్, గ్రూప్ ఫొటోతో చెక్ పెట్టిన ఈసీ

- ఈసీలో విభేదాల వార్తలను ఖండించిన పూర్తిస్థాయి కమిషన్
- నిర్ణయాలన్నీ ఏకగ్రీవమేనని స్పష్టం చేసిన ముగ్గురు కమిషనర్లు
- ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్థించిందని వెల్లడి
- పనితీరును మెరుగుపర్చేందుకు అంతర్గత విధానాల్లో కీలక మార్పులు
- ఈసీఐనెట్ పోర్టల్‌పై సమీక్షకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు




పెన్ పవర్ డెస్క్:భారత ఎన్నికల సంఘం (ఈసీఐ)లో కమిషనర్ల మధ్య తీవ్ర విభేదాలు తలెత్తాయంటూ గత కొద్ది రోజులుగా వస్తున్న వార్తలను కమిషన్ తీవ్రంగా ఖండించింది. ఈ ఆరోపణలకు తెరదించుతూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ)

- మిగతా 2లో



## పరవాడ ఫార్మా కాలుష్యంపై పవన్ కల్యాణ్ సీరియస్..

### 95 కంపెనీలకు నోటీసులు

- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలతో ఫార్మాసిటీపై పీసీబీ చర్యలు
- సోషల్ మీడియా ఫిర్యాదు ఆధారంగా కాలుష్యంపై తనిఖీలు
- పరవాడలోని 95 ఫార్మా పరిశ్రమలకు షోకాజ్ నోటీసులు జారీ
- వ్యర్థాల నిర్వహణపై పరిశ్రమలకు కీలక దిద్దుబాటు చర్యల ఆదేశం

- మిగతా 2లో

## ఏపీ, కర్ణాటక పెద్దల ఆజ్ఞలను పాటిస్తూ ఇక్కడి నాణ్యమైన బొగ్గును ఆ రాష్ట్రాలకు తరలిస్తున్నారు



- విద్యుత్ రంగాన్ని రేవంత్ ప్రభుత్వం నాశనం చేసిందన్న జగదీశ్ రెడ్డి
- వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి రేవంత్ డైవర్షన్ డ్రామాలు ఆడుతున్నారని విమర్శ
- విద్యుత్ ఉత్పత్తిని పెంచాలని డిమాండ్

- మిగతా 2లో

## సీఈసీ రాజీనామా చేయాల్సిందే

### ఈసీ ప్రెస్ నోట్‌పై కాంగ్రెస్ ఫైర్

- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు కాంగ్రెస్ డిమాండ్
- ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని పట్టు
- కోట్లాది మంది ఓటర్ల హక్కును హరించే కుట్ర జరుగుతోందని ఆరోపణ
- ఎన్నికల సంఘం ఇచ్చిన వివరణపై జైరాం రమేశ్ తీవ్ర విమర్శలు
- యువతను లక్ష్యంగా చేసుకుని జాబితాల నుంచి పేర్లు తొలగిస్తున్నారని ధ్వజం

- మిగతా 2లో



# ఈసీ ప్రకటనతో అపోహలకు తెరపడింది

- మొదటి పేజి తరువాయి

తాజాగా ఈసీ వివరణతో ముగిసిందని తెలిపారు.స్వల్పకాలిక రాజకీయ ప్రయోజనాల కోసం భారత ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల ప్రక్రియలపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు చేయడం దురదృష్టకరమని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఎన్నికల ఫలితాలు ప్రజల తీర్పును ప్రతిబింబిస్తాయని, బలమైన ప్రజాస్వామ్యంలో గెలుపును, ఓటమిని సమానంగా, హుందాగా స్వీకరించడమే నిజమైన నాయకత్వ లక్షణమని హితవు పలికారు. రాజ్యాంగ సంస్థలను గౌరవించడం అత్యంత ముఖ్యమని, భారత ప్రజాస్వామ్య ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడం పార్టీలకు అతీతంగా నాయకులందరి ఉమ్మడి బాధ్యత అని ఆయన గుర్తుచేశారు.

**సంయుక్త ప్రకటనతో వివాదానికి ముగింపు**

కాగా, గత కొద్ది రోజులుగా తమ మధ్య తీవ్ర విభేదాలు ఉన్నాయంటూ వస్తున్న ఊహాగానాలకు భారత ఎన్నికల సంఘం పూర్తిస్థాయి కమిషన్ శనివారం తెరదించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి న్యూఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో సమావేశమయ్యారు. అనంతరం ముగ్గురూ కలిసి ఉన్న ఫోటోతో పాటు ఒక సంయుక్త ప్రకటనను విడుదల చేశారు. కమిషన్ అంతర్గత పనితీరు, ఓటర్ల జాబితా సవరణ, సాంకేతిక వ్యవస్థలపై వస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు.

**వివాదానికి నేపథ్యం ఇదే..**

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు సంబంధించిన పలు నిర్ణయాలపై కమిషనర్లు సంధు, జోషి అభ్యంతరాలు వ్యక్తం చేశారంటూ సెప్టెంబర్ 23న ఓ ప్రముఖ ఆంగ్ల పత్రికలో కథనం ప్రచురితమైంది. ఈ కథనం దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం రేపింది. ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల సంఘం పనితీరుపై సందేహాలు వ్యక్తం చేస్తూ, మరింత పారదర్శకత అవసరమని డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలోనే పూర్తిస్థాయి కమిషన్ సంయుక్తంగా స్పందించి, తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేసింది.

రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కోసం 2025 జూన్ 24న జారీ చేసిన ఆదేశాలను ముగ్గురు కమిషనర్లు ఏకగ్రీవంగా ఆమోదించారని ఈసీ తన ప్రకటనలో పేర్కొంది. ఆ తర్వాత కార్యక్రమ షెడ్యూళ్లను కూడా ఏకాభిప్రాయంతోనే విడుదల చేశామని తెలిపింది. ఈ ఆదేశాలను సుప్రీంకోర్టు సైతం సమర్థించిందని గుర్తుచేసింది. నిర్ణయాలన్నీ సమష్టిగా, సంస్థాగత విధివిధానాలను అనుసరించే తీసుకుంటామని కమిషన్ స్పష్టం చేసింది.

# ఎడిటర్ వ్యూ

## వైసీపీ స్ట్రాటజీ వర్క్ అవుట్ అవుతుందా?

## అందుకే టీడీపీని టార్గెట్ చేసిందా?

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా డీఎస్సీ చుట్టూ జరుగుతున్న రాజకీయ పోరు తీవ్ర స్థాయికి చేరింది. ఈ అంశం వెనుక వైసీపీ రాజకీయ అస్త్రాలు, వ్యూహాలు ఉన్నాయనే విశ్లేషణలు రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా, విద్యాశాఖ మంత్రిగా ఉన్న నారా లోకేశ్ లక్ష్యంగా మరియు మిత్రపక్షాలైన టీడీపీ–బీజేపీ–జనసేన మధ్య సమతుల్యతను దెబ్బతీసే విధంగా ఈ వివాదాన్ని సజీవంగా ఉంచేందుకు వైసీపీ ప్రయత్నిస్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నారా లోకేశ్ లక్ష్యంగా వ్యూహంకూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి నియామక ప్రక్రియను వేగవంతం చేసింది. అయితే, నియామకాలు పూర్తయిన తర్వాత ఈ ప్రక్రియలో, ముఖ్యంగా స్పోర్ట్స్ కోటా, పేపర్ లీకేజీ మరియు టెట్ అర్హతలలో అక్రమాలు జరిగాయంటూ వైసీపీ ఆరోపిస్తోంది. గవర్నర్ కు కూడా ఫిర్యాదు చేశారు. ఎన్ని కేసులు పెట్టినా యుద్ధం ఆగదని జగన్ స్పష్టం చేయడంతో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఎదుట టీడీపీని పలుచన చేయాలని భావిస్తున్నట్లుంది.

**లోకేశ్ ను టార్గెట్ చేయడం ద్వారా...**

విద్యా శాఖకు మంత్రిగా ఉన్న నారా లోకేశ్ ను నేరుగా టార్గెట్ చేయడం ద్వారా ఆయన రాజకీయ ప్రతిష్టను దెబ్బతీయడం వైసీపీ ప్రధాన వ్యూహంగా కనిపిస్తోంది.ఈ వ్యవహారంపై లోకేష్ రాజీనామా చేయాలని, సీబీఐ దర్యాప్తు జరిపించాలని జగన్ మోహన్ రెడ్డి డిమాండ్ చేస్తున్నారు. బీజేపీ ఎదుట టీడీపీని పలుచన చేసే వ్యూహమా?రాజకీయ విశ్లేషకుల ప్రకారం, వైసీపీ ఈ అంశాన్ని ఇంత పెద్ద ఎత్తున లేవనెత్తడం వెనుక కేంద్రంలో ఉన్న బీజేపీ పెద్దల దృష్టిని ఆకర్షించే వ్యూహం కూడా ఉండవచ్చు. పరిపాలనా లోపాలను ఎత్తిచూపడంతో అవినీతి రహిత, పారదర్శక పాలన అందిస్తామని కేంద్రానికి హామీ టీడీపీ ఇచ్చింది. రాష్ట్రంలో మొదటి పెద్ద రిక్రూట్‌మెంట్‌లోనే అక్రమాలకు పాల్పడిందనే ఇంప్రెషన్‌ను బీజేపీ హైకమాండ్ ముందు ఉంచాలని వైసీపీ భావిస్తుండవచ్చు.అందుకే మెగా డీఎస్సీని వదలకుండా పట్టుకుని బీజేపీ దృష్టిలో లోకేశ్ ను పలుచన చేస్తే ఆ ప్రభావం కూటమిపై పడుతుందని వైసీపీ అంచనా వేస్తున్నట్లు అనిపిస్తుంది.

**కేంద్ర సంస్థల జోక్యం కోసం డిమాండ్...**

రాష్ట్ర దర్యాప్తు సంస్థలపై నమ్మకం లేదని, కేవలం సీబీఐ విచారణ ద్వారానే నిజాలు బయటపడతాయని జగన్ పదే పదే ట్వీట్లు మరియు ప్రెస్ మీట్ల ద్వారా ఒత్తిడి పెంచుతున్నారు. దీని ద్వారా కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య, ముఖ్యంగా టీడీపీ–బీజేపీ బంధంలో ఒక రకమైన ఇబ్బందికర వాతావరణాన్ని సృష్టించవచ్చునేది విపక్షాల అంతర్గత అంచనాగా కనిపిస్తోంది. గత వైసీపీ హయాంలో సరైన ఉద్యోగ నోటిఫికేషన్లు రాలేదనే అసంతృప్తి నిరుద్యోగుల్లో ఉందనే విమర్శలను కౌంటర్ చేయడానికి ఈ అంశం ఉపయోగపడుతుందని వైసీపీ భావిస్తోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం సాధించిన అతిపెద్ద విజయాల్లో ఒకటైన మెగా డీఎస్సీపై 'అక్రమాల మరక' వేయడం ద్వారా మైలేజ్ పొందాలని ప్రతిపక్షం భావిస్తోంది. నిరుద్యోగ యువతలో కూటమి ప్రభుత్వంపై నమ్మకాన్ని సడలించేలా ప్రచారం చేయడం కూడా ఇందులో భాగమే. వైసీపీ చేస్తున్న ఆరోపణలను అధికార టీడీపీ తీవ్రంగా ఖండిస్తోంది. ఇదంతా కేవలం "దుష్ప్రచార వ్యూహం" అని కొట్టిపారేస్తోంది. మరి బీజేపీ దృష్టిలో టీడీపీని పలుచన చేయాలన్న వైసీపీ వ్యూహం ఎంత మేరకు పలుచన చేస్తుందన్నది చూడాలి.

## ఏపీ, కర్ణాటక పెద్దల ఆజ్ఞలను పాటిస్తూ ఇక్కడి నాణ్యమైన బొగ్గును ఆ రాష్ట్రాలకు తరలిస్తున్నారు

కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఇచ్చిన హామీల అమలులో రేవంత్ రెడ్డి సర్కార్ పూర్తిగా విఫలమైందని, సాగు, తాగునీటితో పాటు విద్యుత్ రంగంలోనూ అరాచకం సృష్టిస్తోందని మండిపడ్డారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఎప్పుడూ డైవర్షన్ డ్రామాలు ఆడుతుంటారని దుయ్యబట్టారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తిపై ప్రభుత్వం తప్పుడు లెక్కలు చెబుతోందని, ఏకంగా 40 లక్షల టన్నుల బొగ్గును మాయం చేశారని సంచలన ఆరోపణలు చేశారు. ఏపీ, కర్ణాటక ప్రభుత్వాల పెద్దల ఆజ్ఞలను పాటిస్తూ ఇక్కడి నాణ్యమైన బొగ్గును ఆ రాష్ట్రాలకు తరలిస్తున్నారని దుయ్యబట్టారు. ఇక యాదాద్రి పవర్ ప్లాంట్‌పై కాంగ్రెస్ నేతలు అసత్య ప్రచారాలు చేస్తున్నారని, సిమెంట్ పరిశ్రమలకు అవసరమైన యాష్ (బూడిద) అవసరాలను దృష్టిలో ఉంచుకునే దాన్ని దామరచర్లలో ఏర్పాటు చేశామని స్పష్టం చేశారు. ఎండిపోతున్న పొలాలు సీఎం రోజువారీ డ్రామాలతో పండవని, ఇప్పటికైనా అనవసరపు పనులు మాని పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తిని పెంచాలని డిమాండ్ చేశారు.పాలిచ్చే ఆవులాంటి ట్రాన్స్‌కోను తన సన్నిహితులకు కట్టబెట్టేందుకు సీఎం రేవంత్ కుట్ర పన్నుతున్నారని జగదీశ్ రెడ్డి ఆరోపించారు. దేశంలో ఢిల్లీ, ముంబై, ఒడిశా వంటి ప్రాంతాల్లో విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించిన చోట ప్రజలపై విపరీతమైన భారం పడిందని అన్నారు. కేసీఆర్ మీద ఎంత ఒత్తిడి ఉన్నా నాటి ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని ప్రైవేట్‌పరం చేయలేదని, కానీ ప్రస్తుత సర్కార్ మాత్రం కమీషన్లకు ఆశపడి ట్రాన్స్‌కో లక్షల కోట్ల ఆస్తులను కారుచౌకగా అమ్మేయాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో ట్రాన్స్‌కో ఉద్యోగులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, ప్రశ్నించిన అధికారులపై ఏసీబీ కేసుల పేరుతో బెదిరింపులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ అనుసరించే ఈ ప్రజా వ్యతిరేక విధానాలపై బీఆర్ఎస్ తీవ్రంగా పోరాడుతుందని హెచ్చరించారు.నాటి సీఎం కేసీఆర్ చొరవతోనే తెలంగాణ చీకట్ల నుంచి వెలుగులోకి వచ్చిందని కొనియాడారు. అసాధ్యమనుకున్న 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను కొన్ని నెలల వ్యవధిలోనే అన్ని వర్గాలకు అందించిన ఘనత బీఆర్ఎస్‌దేనని స్పష్టం చేశారు. కేవలం ట్రాన్స్‌కోపైనే రూ.36 వేల కోట్లు వెచ్చించి, ఎక్కడ విద్యుత్ సరఫరా నిలిచినా మరో మార్గం ద్వారా అనుసంధానించే అధునాతన గ్రిడ్ వ్యవస్థను హైదరాబాద్‌లో ఏర్పాటు చేశామని గుర్తుచేశారు.

## కర్నూలులో ఏవియేషన్ అకాడమీ రావడం చరిత్రాత్మకం

రాష్ట్రంలోనే ప్రప్రథమంగా కర్నూలు ఎయిర్‌పోర్టులో ఏవియేషన్ ట్రైనింగ్ సెంటర్ అందుబాటులోకి రావడం చరిత్రాత్మకమని రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కర్నూలు విమానాశ్రయం వేదికగా ఈరోజు 'ఓరియంట్ ఫ్లైట్స్ ఏవియేషన్ అకాడమీ' ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, టీజీ భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజు, జిల్లా కలెక్టర్ సిరి, స్థానిక ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, కేఈ శ్యామ్ బాబుతో పాటు అకాడమీ చైర్మన్ ఆనంద్ జాకబ్ వర్గీస్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా భవిష్యత్ ప్రణాళికలపై మాట్లాడిన మంత్రి జనార్దన్ రెడ్డి... ఓర్వకల్లులో అత్యాధునిక హంగులతో 'డ్రోన్ సిటీ'ని ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించారు. దీన్ని రెండు దశలుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. తొలి విడతలో 180 ఎకరాల్లో, ఆ తర్వాత రెండో దశలో మరో 400 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు.గతంలో 2017లో కర్నూలు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి పునాదిరాయి వేసి, అతి తక్కువ కాలంలోనే దానిని పూర్తి చేసి ప్రజలకు అంకితం చేశామని జనార్దన్ రెడ్డి గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో ఏవియేషన్ సెక్టార్‌లో ప్రొఫెషనల్స్, పైలట్లకు డిమాండ్ విపరీతంగా పెరగనుందని తెలిపారు. ఈ కొత్త ట్రైనింగ్ సెంటర్ ద్వారా కర్నూలు జిల్లా యువతతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు విమానయాన రంగంలో నిపుణులుగా శిక్షణ పొందే సువర్ణావకాశం లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్‌తో కలవాలనే ఉద్దేశంతోనే జగన్ వైఖరి మార్చుకుంటున్నారా?

వైసీపీ అధినేత జగన్ పై టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. జగన్‌ది అవకాశవాద, ద్వంద్వ వైఖరి అని ఆరోపిస్తూ సోషల్ మీడియా వేదికగా పలు కీలక ప్రశ్నలు సంధించారు. ఆయన రాజకీయ సౌలభ్యం కోసం వైఖరులు మార్చుకుంటున్నారని ఘాటుగా విమర్శించారు.

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ఇప్పుడు ఆరోపణలు చేస్తున్న జగన్, గతంలో స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఇదే ప్రక్రియను ప్రామాణికంగా తీసుకున్నారని లావు గుర్తుచేశారు."ఎస్ఐఆర్ పూర్తయ్యాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మీ పార్టీ ఎమ్మెల్సీ లెల్ల అప్పిరెడ్డి హైకోర్టును ఆశ్రయించిన విషయం వాస్తవం కాదా? కోర్టులో ఒకలా, ఇప్పుడు మరోలా మాట్లాడటంలోని ఆంతర్యమేమిటి?" అని ఆయన ప్రశ్నించారు.అదేవిధంగా, ఎన్నికల కమిషనర్ల నియామక ప్యానెల్ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని (సీజేఐ) తొలగిస్తూ 2023లో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన చట్టానికి వైసీపీ మద్దతు ఇచ్చిందని లావు పేర్కొన్నారు. కానీ ఇప్పుడు, ప్రధాని, ప్రతిపక్ష నేతతో పాటు సీజేఐ కూడా ప్యానెల్‌లో ఉండాలని జగన్ డిమాండ్ చేయడం ఆయన ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు.ఈ ఆకస్మిక మార్పుల వెనుక రాజకీయ వ్యూహం ఉందని లావు అనుమానం వ్యక్తం చేశారు. 2029 ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, తన మాతృ సంస్థ అయిన కాంగ్రెస్‌తో రాజకీయంగా కలవాలనే ఉద్దేశంతోనే జగన్ ఇలా తన వైఖరిని మార్చుకుంటున్నారా? అని ఆయన సూటిగా ప్రశ్నించారు.

# పరవాడ ఫార్మా కాలుష్యంపై పవన్ కల్యాణ్ సీరియస్.. 95 కంపెనీలకు నోటీసులు

సోషల్ మీడియాలో వచ్చిన ఒక ఫిర్యాదుపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తక్షణమే స్పందించారు. ఆయన ఆదేశాలతో అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మాసిటీలోని 95 పరిశ్రమలకు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) షోకాజ్ నోటీసులు జారీ చేసింది. శుద్ధి చేయని వ్యర్థాలను వర్షపు నీటి కాలువల్లోకి విడుదల చేస్తూ కాలుష్యానికి కారణమవుతున్నారన్న ఆరోపణలపై ఈ చర్యలు తీసుకుంది.వివరాల్లోకి వెళితే, పరవాడ ఫార్మాసిటీ సమీపంలోని డ్రెయిన్లలో నల్లటి రంగులో, దుర్వాసనతో కూడిన నీరు ప్రవహిస్తున్నట్లు శుక్రవారం ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక వీడియో పోస్ట్ అయింది. ఈ వీడియో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి వెళ్లడంతో, వెంటనే క్షేత్రస్థాయిలో విచారణ జరిపి వాస్తవాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆయన పీసీబీ అధికారులను ఆదేశించారు.డిప్యూటీ సీఎం ఆదేశాలతో రంగంలోకి దిగిన పీసీబీ అధికారులు, వీడియోలో కనిపించిన ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. నమూనాలను సేకరించి పరిశీలించగా, శుద్ధి చేయని వ్యర్థ జలాలు వర్షపు నీటి కాలువల్లోకి చేరుతున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. దీనికి బాధ్యులుగా ఫార్మాసిటీలోని మొత్తం 95 కంపెనీలకు షోకాజ్ నోటీసులు జారీ చేసి, ఏడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

కేవలం నోటీసులు ఇవ్వడమే కాకుండా, కాలుష్య నివారణకు పలు కఠినమైన దిద్దుబాటు చర్యలను కూడా పీసీబీ తప్పనిసరి చేసింది. పరిశ్రమల ప్రాంగణంలోనే వర్షపు నీటిని నిల్వ చేయాలని, కలుషిత నీటిని బయటకు వదలరాదని స్పష్టం చేసింది. వ్యర్థాల నిర్వహణను డిజిటలైజ్ చేయాలని, తేదీ, సమయంతో సహా రికార్డ్ చేసే సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి ఫుటేజీని ఆరు నెలల పాటు భద్రపరచాలని సూచించింది. ఆన్‌లైన్ మానిటరింగ్ వ్యవస్థతో కూడిన స్క్రబ్బర్లను వాడాలని, పర్యావరణ అనుమతుల నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆదేశాల్లో పేర్కొంది.నిర్ణీత సమయంలో సంతృప్తికరమైన సమాధానం ఇవ్వని, అక్రమంగా వ్యర్థాలను విడుదల చేస్తున్నట్లు తేలిన పరిశ్రమలపై పర్యావరణ పరిరక్షణ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పీసీబీ హెచ్చరించింది. తీసుకున్న చర్యలపై ఒక సమగ్ర నివేదికను ఉప ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపినట్లు అధికారులు తెలిపారు.

# ఎన్నికల కమిషనర్ల మధ్య విభేదాలంటూ ప్రచారం..

- మొదటి పేజి తరువాయి

జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి శనివారం న్యూఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో సమావేశమయ్యారు. అనంతరం ముగ్గురూ కలిసి ఉన్న గ్రూప్ ఫోటోతో పాటు ఒక సుదీర్ఘమైన ప్రెస్ నోట్‌ను విడుదల చేశారు. కమిషన్ అంతర్గత పనితీరు, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ా×=), ఓటర్ల నమోదు ప్రక్రియ, సాంకేతిక వ్యవస్థలపై వస్తున్న ఆరోపణలపై ఇందులో సమగ్రంగా వివరణ ఇచ్చారు.

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు సంబంధించిన పలు నిర్ణయాలపై కమిషనర్లు సంధు, జోషి అభ్యంతరాలు వ్యక్తం చేశారని సెప్టెంబర్ 23న ఓ ఆంగ్ల పత్రికలో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ కథనం దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం రేపింది. ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల సంఘం పనితీరుపై సందేహాలు వ్యక్తం చేస్తూ, మరింత పారదర్శకత అవసరమని డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలోనే పూర్తిస్థాయి కమిషన్ సంయుక్తంగా స్పందించింది.రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కోసం 2025 జూన్ 24న జారీ చేసిన ఆదేశాలను ముగ్గురు కమిషనర్లు ఏకగ్రీవంగా ఆమోదించారని ఈసీ తన ప్రకటనలో స్పష్టం చేసింది. ఆ తర్వాత ఈ కార్యక్రమానికి సంబంధించిన షెడ్యూళ్లను కూడా ఏకాభిప్రాయంతోనే విడుదల చేశామని తెలిపింది. ఈ ప్రత్యేక సవరణ ఆదేశాలను సుప్రీంకోర్టు సైతం సమర్థించిందని గుర్తుచేసింది.కొత్త ఓటర్ల నమోదుకు ఉపయోగించే ఫారం-6లో, దరఖాస్తుదారులు తమ తల్లిదండ్రుల పేర్ల ద్వారా గత సవరణతో తమ సంబంధాన్ని ధ్రువీకరించాలనే నిబంధనపై వస్తున్న విమర్శలపైనా కమిషన్ స్పందించింది. ఈ డిక్లరేషన్‌ను కూడా సుప్రీంకోర్టు సమర్థించిందని తెలిపింది. అయితే, ఈ నిబంధన కేవలం ప్రత్యేక సవరణ ప్రక్రియకు మాత్రమే వర్తిస్తుందని, మిగతా సమయాల్లో ఎలక్టర్ల నమోదు నిబంధనలు, 1960 ప్రకారం నిర్దేశించిన ఫారాలనే వాడతామని స్పష్టం చేసింది.గోవాలో 97 మంది ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోవడంపై కూడా ఈసీ వివరణ ఇచ్చింది. ఇంటింటి సర్వే నిర్వహించి, అవసరమైన ఫారాలను సేకరించాలని గోవా చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈఓ) సంబంధిత బూత్ లెవల్ అధికారులను ఆదేశించారని పేర్కొంది. ఇప్పటికే ఆ 97 మందిలో 81 మంది తమ పేర్లను చేర్చాలని కోరుతూ ఫారం-6 సమర్పించారని వెల్లడించింది.

ఇక, ఎలక్టోరల్ రోల్ డేటాబేస్‌కు యాక్సెస్ విషయంలో ఈసీఐనెట్ (జుజ×చీజు) పోర్టల్‌పై తలెత్తిన ఆందోళనలపైనా కమిషన్ స్పందించింది. క్షేత్రస్థాయి అధికారులకు వారి చట్టబద్ధమైన అధికారాలకు అనుగుణంగానే 'రోల్-బేస్డ్ యాక్సెస్' ఇస్తామని స్పష్టం చేసింది. ఈ పోర్టల్ పనితీరును సమీక్షించేందుకు ఓ సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు, ఇందులో ఐఐటీ లేదా ట్రిపుల్ ఐటీకి చెందిన స్వతంత్ర నిపుణుడు కూడా ఉంటారని ప్రకటించింది. క్యాబినెట్ సెక్రటరీకి పంపిన లేఖ ఈసీ విధానపరమైన అంశాలకు సంబంధించింది కాదని, డిప్యుటేషన్‌పై ఉన్న ఓ అధికారి పని పునఃపంపిణీకి మాత్రమే సంబంధించిందని కమిషన్ స్పష్టం చేసింది.

అంతర్గత పనివిధానాలను మరింత బలోపేతం చేసేందుకు పలు చర్యలు తీసుకుంటున్నట్లు ఈసీ ప్రకటించింది. ఇకపై కమిషన్ సమావేశాల అజెండాలను సభ్యులకు ముందుగానే సర్క్యులేట్ చేయాలని, సమావేశం అనంతరం మినిట్స్ జారీ చేయాలని నిర్ణయించింది. కమిషనర్లు అధికారులకు జారీ చేసే ఆదేశాలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేసింది. ఢిల్లీ, మహారాష్ట్రల్లో ప్రత్యేక సవరణ గడువును పొడిగిస్తున్నట్లు తెలిపింది. తమ ప్రధాన నిర్ణయాలన్నీ సమష్టిగా, ఏకగ్రీవంగానే తీసుకున్నామని కమిషన్ పునరుద్ఘాటించింది.

# సీఎం విజయ్ నటనను ఇంకా ఆపలేదు: స్టాలిన్

తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే అధినేత విజయ్‌పై మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎం.కే. స్టాలిన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సినిమాలకు స్వస్తి పలికినప్పటికీ, ప్రజల ముందు విజయ్ ఇంకా నటిస్తూనే ఉన్నారని ఆయన ఎద్దేవా చేశారు. ఈ మేరకు శనివారం 'ఎక్స్' వేదికగా ఆయన ఒక పోస్ట్ చేశారు.

మధురాంతకం అసెంబ్లీ ఉప ఎన్నికల ప్రచారంలో విజయ్ నటనను తాను ప్రత్యక్షంగా చూశానని స్టాలిన్ పేర్కొన్నారు. డీఎంకేను ఒక దుష్టశక్తిగా, టీవీకేను పవిత్ర శక్తిగా విజయ్ అభివర్ణించడం హాస్యాస్పదమని విమర్శించారు. విజయ్ ప్రభుత్వ హయాంలో పరిపాలన పూర్తిగా విఫలమైందని, రాష్ట్రంలో విద్యుత్ కోతలు, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, పాల కొరత, శాంతిభద్రతల క్షీణత వంటి సమస్యలు పెరిగిపోయాయని ఆరోపించారు. గత డీఎంకే ప్రభుత్వ పథకాలకే పేర్లు మార్చి టీవీకే ప్రభుత్వం అమలు చేస్తోందని ఆయన మండిప డ్డారు.జెమ్ గ్రానైట్స్ ఛైర్మన్ ఆర్. వీరమణికి సంబంధించిన పోక్సో కేసులో డీఎంకేపై విజయ్ చేస్తున్న ఆరోపణలు కేవలం నిరాధారమని స్టాలిన్ కొట్టిపారేశారు. ఈ విషయంపై తాను ఇప్పటికే అసెంబ్లీలో స్పష్టమైన వివరణ ఇచ్చానని గుర్తుచేశారు. దర్యాప్తు దశలో ఉన్న అంశాలను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవద్దని మద్రాస్ హైకోర్టు ఆదేశించినప్పటికీ, ఎన్నికల ప్రచారంలో విజయ్ పదేపదే ఈ అంశాన్ని ప్రస్తావించడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రజల ముందు నటించడం మాని, ముఖ్యమంత్రి పదవికి ఉండాల్సిన రాజకీయ హుందాతనాన్ని ప్రదర్శించాలని విజయ్‌కు స్టాలిన్ హితవు పలికారు.

## భారీ వర్షాలతో ఉత్తరాంధ్ర అతలాకుతలం..

**నిండిన జలాశయాలు.. తగ్గిన వర్షపాతం లోటు**

తాజా వర్షాల వల్ల రాష్ట్రంలోని 29 ప్రధాన రిజర్వాయర్లలోకి భారీగా నీరు వచ్చి చేరినట్లు ఇరిగేషన్ అధికారులు సీఎంకు వివరించారు. సెప్టెంబర్ 23 నాటికి 101 టీఎంసీలుగా ఉన్న నీటి నిల్వ, కేవలం మూడు రోజుల్లో 21 టీఎంసీలు పెరిగి 122 టీఎంసీలకు చేరిందని తెలిపారు. ఒక్క ఉత్తరాంధ్రలోని 11 ప్రాజెక్టుల్లోనే సుమారు 5 టీఎంసీల నీరు అదనంగా చేరిందని వివరించారు. ఈ వర్షాల వల్ల రాష్ట్రంలో వర్షపాతం లోటు 50 శాతం నుంచి 31 శాతానికి తగ్గిందని అధికారులు తెలిపారు.

గోదావరిపై ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ప్రవాహం 1.20 లక్షల క్యూసెక్కుల నుంచి 3.50 లక్షల క్యూసెక్కులకు పెరిగింది. వంశధారపై గొట్టా బ్యారేజీకి, నాగావళిపై నారాయణపురం ఆనకట్టకు కూడా ఇన్‌ఫ్లో రికార్డు స్థాయిలో పెరిగింది. పెరిగిన ప్రవాహాలను సద్వినియోగం చేసుకుని రిజర్వాయర్లతో పాటు చిన్న, మధ్య తరహా నీటి వనరులను కూడా నింపాలని సీఎం ఆదేశించారు. వరద తగ్గుముఖం పట్టినా, ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగించాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 10 శాతం వృద్ధి సాధ్యమే

దేశ ఆర్థిక వృద్ధి రేటు 10 శాతం మార్కును అధిగమించాలంటే అన్ని రంగాల్లోనూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని పెంచాల్సిన ఆవశ్యకత ఉందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సెమీకండక్టర్లు, క్వాంటం టెక్నాలజీ వంటి భవిష్యత్ సాంకేతిక విభాగాల్లో భారీగా పెట్టుబడులు పెట్టడం ద్వారానే దేశం అభివృద్ధి పథంలో దూసుకెళుతుందని ఆమె స్పష్టం చేశారు. బెంగళూరులో నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆమె ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.సాంకేతికత ఆధారంగా వివిధ రంగాల్లో మరిన్ని అంకుర సంస్థలు ఆవిర్భవించాలని ఆమె పిలుపునిచ్చారు. నూతన సాంకేతికతలను ప్రజలు సులభంగా అందిపుచ్చుకునేలా నైపుణ్యాభివృద్ధి, శిక్షణా కార్యక్రమాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కేవలం దిగ్గజ సంస్థలకే పరిమితం కాకుండా, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో (ఎంఎస్ఎంఈ) సైతం ఏఐ వినియోగం గణనీయంగా పెరగాలని ఆమె ఆకాంక్షించారు.దేశ మౌలిక సదుపాయాల కల్పన, ఆర్థికాభివృద్ధిలో తదుపరి దశకు చేరుకోవాలంటే అన్ని విభాగాల్లోనూ డిజిటల్ వ్యవస్థలకు పెద్దపీట వేయాలని నిర్మలా సీతారామన్ వివరించారు. ఈ ఆధునిక సాంకేతిక రంగాలకు తగిన ప్రోత్సాహం అందిస్తే, దేశ భవిష్యత్తును మరింత ఉజ్వలంగా తీర్చిదిద్దవచ్చని ఆమె అభిప్రాయపడ్డారు.

## సీఈసీ రాజీనామా చేయాల్సిందే

భారత ఎన్నికల సంఘం ) తీరుపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని, ఆయనపై విచారణ జరపాలని డిమాండ్ చేసింది. ఓటర్ల జాబితా సవరణ పేరుతో దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఓటర్ల పేర్లను తొలగించే భారీ కుట్ర జరుగుతోందని ఆరోపించింది. ఈ సవరణ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని కాంగ్రెస్ పార్టీ శనివారం గట్టిగా పట్టుబట్టింది.ఎన్నికల సంఘంలో అంతర్గత విభేదాలు ఉన్నాయంటూ మీడియాలో వచ్చిన కథనాల నేపథ్యంలో, ఈసీఐ నేడు ఓ ప్రెస్ నోట్ విడుదల చేసింది. ఈ వివరణ కాంగ్రెస్ ఆగ్రహాన్ని మరింత పెంచింది. ఈసీఐ ఇప్పుడు ఆత్మరక్షణలో పడిందని కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ జైరాం రమేశ్ విమర్శించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా వరుస పోస్టులతో ఈసీఐని, సీఈసీని లక్ష్యంగా చేసుకుని పలు ప్రశ్నలు సంధించారు."మీడియా కథనాల్లో వచ్చిన ఆరోపణలను ఈసీఐ తన ప్రెస్ నోట్‌లో ఎక్కడా నేరుగా ఖండించలేదు. వాటి తీవ్రతను తగ్గించే ప్రయత్నం మాత్రమే చేసింది. గోవా విషయంలో తప్పు చేసి దొరికిపోయాక, తొలగించిన 97 మందిలో 81 మంది పేర్లను తిరిగి చేర్చామని సిగ్గులేకుండా చెబుతోంది. అంటే, మొదట ఓటర్ల హక్కును కాలరాసి, దొరికిపోయాక మళ్లీ వారి పేర్లను చేర్చుతున్నామని చెప్పడం ఎంతవరకు సమంజసం?" అని జైరాం రమేశ్ ప్రశ్నించారు.ఢిల్లీ, మహారాష్ట్రల్లో ఓటరు నమోదు గడువును పొడిగించిన ఈసీఐ.. కర్ణాటక, తెలంగాణ, బిహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో అన్యాయంగా ఓటు హక్కు కోల్పోయిన వారి పరిస్థితి ఏంటని నిలదీశారు. కేవలం ఒక వ్యక్తి అవినీతి వల్ల ఓటు హక్కు కోల్పోయిన ఈ రాష్ట్రాల ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఈసీఐకి లేదా అని ఆయన అన్నారు.సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు ఐఐటీ/ట్రిపుల్ ఐటీ నిపుణులతో ఈసీనెట్ పోర్టల్‌ను సమీక్షిస్తామని చెప్పడం, సమస్య ఉందని అంగీకరించడమేనని జైరాం రమేశ్ పేర్కొన్నారు. సీఈసీ ఏకపక్ష నిర్ణయాలు, ప్రతిపక్షాలపై ద్వేషం, అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించడం, ముఖ్యంగా యువ ఓటర్లను (జెన్ గ్) లక్ష్యంగా చేసుకోవడం వంటి అంశాలు ఆయన అవినీతిని బయటపెట్టాయని ఆరోపించారు. ఫారం 6లో పార్లమెంటు ఆమోదం లేకుండా మార్పులు చేసి, యువత ఓటు నమోదు చేసుకోకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారని మండిపడ్డారు.సీఈసీ బ్యూరోక్రసీ ముసుగులో దాక్కోవాలని చూస్తున్నారని, కానీ ఆయన బండారం బట్టబయలైందని జైరాం రమేశ్ అన్నారు. దేశమంతా ఆయనను జవాబుదారీ చేయాలని చూస్తోందని, ఈ నేపథ్యంలో సీఈసీ రాజీనామా లేదా ఆయనపై విచారణ జరపడం మినహా మరో మార్గం లేదని స్పష్టం చేశారు.

## పాకిస్థాన్‌లో ఆత్మాహుతి దాడి.. 11 మంది మృతి

పాకిస్థాన్‌లో ఉగ్రవాదులు మరోసారి మారణహోమం సృష్టించారు. వాయవ్య పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో శనివారం చోటుచేసుకున్న ఆత్మాహుతి దాడిలో కనీసం 11 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 30 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.డేరా ఇస్మాయిల్ ఖాన్ జిల్లాలోని ఒక రహదారి పక్కన ఉన్న పోలీసు చెక్‌పోస్ట్‌ను లక్ష్యంగా చేసుకుని ఈ దాడి జరిగింది. పేలుడు పదార్థాలతో నింపిన వాహనంతో వచ్చిన ఆత్మాహుతి బాంబర్, చెక్‌పోస్ట్ సమీపంలోకి రాగానే తనను తాను పేల్చుకున్నాడు. ఈ పేలుడు ధాటికి ఆ ప్రాంతం ఒక్కసారిగా దద్దరిల్లింది. ఈ ఘటనలో భారీ స్థాయిలో ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది.ఈ ఘాతుకానికి తమదే బాధ్యతని పాకిస్థానీ తాలిబన్‌గా పిలిచే తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) ప్రకటించింది. ఇటీవలి కాలంలో పాకిస్థాన్‌లో ఉగ్రవాద కార్యకలాపాలు గణనీయంగా పెరిగాయి. ప్రధానంగా టీటీపీ, బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) వంటి వేర్పాటువాద సంస్థలు వరుస దాడులకు పాల్పడుతున్నాయి. ఈ తాజా ఘటనతో దేశంలోని భద్రతా వ్యవస్థలోని లోపాలపై మరోసారి తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
ఏన్.టి.ఆర్ జిల్లా । కృష్ణా । గుంటూరు । పల్నాడు । బాపట్ల

## దివ్యాంగులకు, ఎస్సీ, ఎస్టీ,ఉద్యోగులకు గ్రీవెన్స్ పై ప్రత్యేక దృష్టి సారించాలి

### జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ



**గుంటూరు, పెన్ పవర్,సెప్టెంబర్ 26 :**
దివ్యాంగులకు, ఉద్యోగులకు, ఎస్సీ, ఎస్టీలకు నిర్వహించే ప్రత్యేక గ్రీవెన్స్ లో అందిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. దివ్యాంగులకు, ఉద్యోగులకు, ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక గ్రీవెన్స్ ను శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో గల ఎస్. ఆర్. శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించారు. అభ్యర్థుల నుండి అర్జీలు స్వీకరించారు. అభ్యర్థుల విన్నపాలను ఆలకించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజా వలి, డిప్యూటీ కలెక్టర్ లు గంగ రాజు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## 10 ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ

**విజయవాడ, పెన్ పవర్,సెప్టెంబర్ 26:**
జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నందిగామ, మైలవరం, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో మూడు రోజుల పాటు జాబ్ మేళాలను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు.



సెప్టెంబర్ 28న నందిగామలోని ఏపీ ఎన్జీవోస్ బిల్డింగ్, గాంధీ సెంటర్‌లో, సెప్టెంబర్ 29న ఇబ్రహీంపట్నంలోని డా. జకీర్ హుస్సేన్ డిగ్రీ కాలేజీలో, సెప్టెంబర్ 30న జగ్గయ్యపేటలోని డిగ్రీ కాలేజీలో ఉదయం 9 గంటలకు జాబ్ మేళాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ప్రతి జాబ్ మేళాకు సుమారు 10 ప్రముఖ కంపెనీలు హాజరై వివిధ ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నాయి. 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, బీటెక్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్యార్హతలు కలిగిన 18 నుంచి 35 ఏళ్ల వయస్సు గల యువతీ యువకులు ఈ ఉద్యోగాలకు అర్హులని పేర్కొన్నారు.
ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.12 వేల నుంచి రూ.35 వేల వరకు వేతనంతో పాటు ఇతర సౌకర్యాలతో కూడిన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని కలెక్టర్ తెలిపారు.
అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ముందుగా తమ పూర్తి వివరాలతో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. జాబ్ మేళాకు హాజరయ్యే సమయంలో రెస్యూమ్ లేదా బయోడేటా, ఆధార్ కార్డు, ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నంబర్, పాన్ కార్డు కాపీ, విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలను వెంట తీసుకురావాలని తెలిపారు. నందిగామ జాబ్ మేళా: 28.09.2026 -- 8919951682, 72072 08075
ఇబ్రహీంపట్నం జాబ్ మేళా: 29.09.2026 -- 95027757755, 80083 76100
జగ్గయ్యపేట జాబ్ మేళా: 30.09.2026 -- 9666815987, 96765 83213 జిల్లాలోని అర్హత కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు ఈ ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ కోరారు.

## గడ్డిపాడు రైల్వే వంతెనకు శంకుస్థాపన మంత్రి పెమ్మసాని





**గుంటూరు: పెన్ పవర్, సెప్టెంబర్, 26,**
కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చొరవతో గడ్డిపాడు రైల్వే గేటు వద్ద రూ.147.36 కోట్లతో నిర్మించనున్న రైల్వే వంతెనకు శనివారం శంకుస్థాపన జరిగింది. కేంద్ర జలశక్తి, రైల్వే శాఖ సహాయ మంత్రి వి. సోమన్నతో కలిసి పెమ్మసాని చంద్రశేఖర్ శంకుస్థాపన చేశారు. గడ్డిపాడు రైల్వే గేటు మీదుగా రోజుకు 78 రైళ్లు, 20 వేలకు పైగా వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని పెమ్మసాని తెలిపారు. వంతెన నిర్మాణంతో ప్రజలకు రాకపోకల ఇబ్బందులు తొలగుతాయని అన్నారు. గుంటూరు జిల్లాకు ఎనిమిది రైల్వే వంతెనల నిర్మాణానికి సుమారు రూ.750 కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు.
ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.68 వేల కోట్ల నిధులు కేటాయించిందని వి. సోమన్న తెలిపారు. గుంటూరు జిల్లాకు ఎనిమిది రైల్వే వంతెనలు మంజూరు కావడం అభినందనీయమన్నారు.
కార్యక్రమంలో ఎంపీ భాష్యం రామకృష్ణ, ఎమ్మెల్యేలు గల్లా మాధవి, నసీర్‌అహ్మద్, ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, రామాంజనేయులు, తెనాలి శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పోరంకిలో మ్యాక్సీవిజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రి ప్రారంభం

**అత్యాధునిక నేత్ర వైద్య సేవలు ప్రజలకు మరింత చేరువ: ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్**





**పెన్ పవర్, కృష్ణా జిల్లాపెనమలూరు, సెప్టెంబర్ 26**
పోరంకిలో మ్యాక్సీవిజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రి నూతన శాఖను రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, ఆసుపత్రి యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ పోరంకిలో నూతన శాఖ అందుబాటులోకి రావడంతో విజయవాడతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు అత్యాధునిక నేత్ర వైద్య సేవలు మరింత చేరువ కానున్నాయని తెలిపారు. దేశవ్యాప్తంగా మ్యాక్సీవిజన్ కంటి వైద్యశాలలకు మంచి గుర్తింపు ఉందని పేర్కొన్నారు. అత్యాధునిక వైద్య పరికరాలతో మెరుగైన నేత్ర వైద్య సేవలు అందించనున్న ఈ ఆసుపత్రి ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం పొందే పేదలకు కూడా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి యాజమాన్యాన్ని కోరారు. ప్రజలకు మెరుగైన నేత్ర వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రారంభమైన నూతన శాఖకు ఆయన అభినందనలు తెలిపారు.
అనుమోలు ప్రభాకర్ రావు మాట్లాడుతూ పోరంకిలో మ్యాక్సీవిజన్ కంటి ఆసుపత్రి ప్రారంభం కావడం శుభ పరిణామమన్నారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అందుబాటులో లేకపోవడంతో కార్యక్రమానికి హాజరు కాలేకపోయారని తెలిపారు. ఆసుపత్రి యాజమాన్యానికి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేయాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కోరినట్లు పేర్కొన్నారు. కార్పొరేట్ స్థాయి ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ సేవలు కూడా అందుబాటులో ఉండటం పేదలకు వరం లాంటిదన్నారు.కంటిసమస్యలతోబాధపడేవారు ఈసదుపాయాన్నిసద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఆరు నెలలకు ఒకసారి కంటి పరీక్షలు చేయించుకోవాలని కోరారు.వెలగపూడిశంకర్ బాబు మాట్లాడుతూ ప్రతి మనిషికి కళ్ళు, గుండె ఎంతో ముఖ్యమైనవని అన్నారు. గతంలో కంటి పరీక్షలు, శస్త్రచికిత్సల కోసం హైదరాబాద్ వంటి ప్రధాన నగరాలకు వెళ్లాల్సి వచ్చేదని తెలిపారు. అలాంటి అత్యాధునిక వైద్య సదుపాయాలతో కూడిన ఆసుపత్రి స్థానికంగా అందుబాటులోకి రావడంగర్వకారణమన్నారు. మ్యాక్సీవిజన్ ఆసుపత్రి సేవలకు మంచి గుర్తింపు ఉందని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని శాఖలను ఏర్పాటు చేసి పేదలకు విస్తృతంగా నేత్ర వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు.

## వీరనారి చిట్యాల ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా ఘన నివాళులు రాచకొండ లక్ష్మయ్య

**గుంటూరు, పెన్ పవర్, సెప్టెంబర్, 26,**
ఈరోజు రింగ్ రోడ్ చంద్రమౌళి నగర్ దగ్గర చాకలి ఐలమ్మ చిత్రకానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించిన గుంటూరు పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యురాలు గళ్ళ మాధవి నేషనల్ దోబీ జాతీయ అధ్యక్షులు అన్నవరపు నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఈరోజు రాకలి ఐలమ్మ 131 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించి ఈసందర్భంగా ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూతెలంగాణ నేలపై ధైర్యానికి, ఆత్మగౌరవానికి, అణగారిన ప్రజల హక్కుల కోసం సాగిన పోరాటానికి ప్రతీకగా నిలిచిన వీరనారి చిట్యాల ఐలమ్మ . ఆమె జీవితం నేటి తరాలకు స్ఫూర్తిదాయకమైన చరిత్ర.సామాజిక, ఆర్థిక అసమానతలు తీవ్రంగా ఉన్న కాలంలో భూస్వామ్య దోపిడీకి, అన్యాయానికి వ్యతిరేకంగా ఐలమ్మ ధైర్యంగా నిలబడ్డారు. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన ఒక మహిళగా ఎన్నో ఒత్తిళ్లు, ప్రతికూల పరిస్థితులు ఎదురైనా తన హక్కుల కోసం వెనకడుగు వేయకుండా పోరాడిన సాహసమే ఆమెను తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది ఎమ్మెల్యే మాధవి అన్నారు తెలుగుదేశం పార్టీ జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి రాచకొండ లక్ష్మయ్య మాట్లాడుతూ
ఐలమ్మ పోరాటం కేవలం ఒక వ్యక్తి లేదా ఒక కుటుంబానికి సంబంధించిన పోరాటం కాదు. పేదలు, రైతులు, కూలీలు, అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం సాగిన పోరాటానికి ఆమె ఒక



ప్రతీకగా నిలిచారు. మహిళలు కూడా అన్యాయాన్ని ప్రశ్నించి, తమ హక్కుల కోసం పోరాడగలరని తన కార్యాచరణ ద్వారా చాటిచెప్పారు లక్ష్మయ్య అన్నారు, నేషనల్ ధోబీ జాతీయ అధ్యక్షుడు అన్నవరపు నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ
చాకలి ఐలమ్మ ధైర్యం, నిబద్ధత, ఆత్మగౌరవం, ప్రజల పట్ల ఉన్న బాధ్యత నేటి సమాజానికి కూడా ఎంతో అవసరం. ముఖ్యంగా యువత సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజాసేవ వంటి విలువలను ఆచరించేందుకు ఐలమ్మ జీవితం స్ఫూర్తిగా నిలుస్తుంది.వీరనారి చిట్యాల ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా ఆమె త్యాగాలను, పోరాట స్ఫూర్తిని స్మరించుకుంటూ ఘన నివాళులు




అర్పిద్దాం.ఐలమ్మ పోరాట స్ఫూర్తి కావాలి సామాజిక న్యాయం కోసం మన అడుగులు ముందుకు సాగాలి
వీరనారి చిట్యాల ఐలమ్మ కి ఘన నివాళులు అర్పించారు
ఈ కార్యక్రమంలో పాల్గొన్న రజక కార్పొరేషన్ డైరెక్టర్ గుర్రపు శాల రామకృష్ణ రజక కార్పొరేషన్ డైరెక్టర్ రాచకొండ నాగేశ్వరరావు జిల్లా కార్యదర్శి పరుచూరి సంజీవరావు ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి శ్రీనివాసరావు 44వ డివిజన్ అధ్యక్షులు గద్దం భద్రయ్య జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి గద్దం శ్రీనివాసరావు45వ డివిజన్ సెక్రెటరీ సాయి కృష్ణ హైకోర్టు లాయర్ శ్రీధర్ వాచ్మెన్ సంఘం అధ్యక్షులు మట్లపొడి పూర్ణచంద్రరావు రేషన్ డీలర్ల అసోసియేషన్ అధ్యక్షులు వంగపాటి అంజయ్య బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి వరగాని ఏడుకొండలు పలువురు నాయకులు పాల్గొన్నారు

## బ్రిడ్జ్ మ్యాన్ ఆఫ్ గుంటూరు’గా పెమ్మసాని సేవలు చిరస్మరణీయం ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**గుంటూరు,పెన్ పవర్,సెప్టెంబరు 26:**
గుంటూరు నగర అభివృద్ధిలో రైల్వే ఓవర్ బ్రిడ్జిలు (ఆర్‌ఓబీలు) కీలక పాత్ర పోషిస్తున్నాయని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరోసభ్యురాలుగళ్ళా మాధవి అన్నారు. గుంటూరుకు అనేక ఆర్‌ఓబీలను మంజూరు చేయించి, కోట్లాది రూపాయల అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్తున్న కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను ఆమె ‘బ్రిడ్జ్ మ్యాన్ ఆఫ్ గుంటూరు’గా అభివర్ణించారు.
గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్--గడ్డిపాడు రైల్వే లెవల్ క్రాసింగ్ (ఎల్‌సీ-3) వద్ద నిర్మించనున్న ఆర్‌ఓబీ పనులకు కేంద్ర రైల్వే, జలశక్తి శాఖ సహాయ మంత్రి వి. సోమన్న, కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే గళ్ళా మాధవి తదితర ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు. అనంతరం శ్రీ వెంకటేశ్వర విజ్ఞానమందిరంలోశిలాఫలకఆవిష్కరణ,సమావేశంనిర్వహించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం గుంటూరు జిల్లాలో అభివృద్ధి పనులు వేగవంతమయ్యాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల




సమన్వయంతో మౌలికసదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత లభిస్తోందన్నారు.గడ్డిపాడు ఆర్‌ఓబీ నిర్మాణంతో గుంటూరు నగరం నుంచి జాతీయ రహదారిపైకి వెళ్లే వారికి, ఇతర ప్రాంతాల నుంచి నగరంలోకి వచ్చే ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. ఇప్పటికేశంకర్‌విలాస్ఆర్‌ఓబీనగర రవాణాకుఉపయోగపడుతోందని, గడ్డిపాడుఆర్‌ఓబీపూర్తయితేట్రాఫిక్‌సమస్యలకుమరింతఉపశమనంల భిస్తుందనిపేర్కొన్నారు.కీలకమైన వంతెనల నిర్మాణాన్ని సవాలుగా స్వీకరించి కార్యరూపం దాల్చేలా కృషిచేస్తున్నడాక్టర్‌పెమ్మసాని



చంద్రశేఖర్ సేవలు అభినందనీయమని గళ్ళా మాధవి అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడునాయకత్వంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నాయని తెలిపారు.గుంటూరు అభివృద్ధికి సహకరిస్తున్న కేంద్ర మంత్రి వి. సోమన్న, కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌తోపాటు కార్యక్రమానికి సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి కృతజ్ఞతలు తెలిపారు.

## పల్నాడు జిల్లా జెడ్పీ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ కృతికా శుక్లా



**నరసరావుపేట, పెన్ పవర్ సెప్టెంబర్ 26:**
పల్నాడు జిల్లా ప్రజా పరిషత్ (జెడ్పీ) ప్రత్యేక అధికారిగా జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జెడ్పీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె బాధ్యతలు చేపట్టి అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ, జెడ్పీ నిధులను సమర్థవంతంగా వినియోగించి పల్నాడు జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, తాగునీరు, రహదారులు, విద్య, వైద్యం తదితర రంగాలకు ప్రాధాన్యత ఇచ్చి అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తామని పేర్కొన్నారు. ప్రజా అవసరాలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా నిధులు ఖర్చు చేసి జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.



ఈ కార్యక్రమంలో నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, జిల్లా అధికారులు, జెడ్పీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యుద్ధప్రాతిపదికన పార్కులు వాకింగ్ ట్రాక్ ల నిర్మాణం ఎమ్మెల్యే నసీర్, నగర కమిషనర్ మయూర్ అశోక్



**గుంటూరు, పెన్ పవర్, సెప్టెంబర్, 26,**
తూర్పు నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలలో సమాన అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని,, అందులో భాగంగా నాలుగు ప్రదేశాలలో పార్కులు వాకింగ్ ట్రాక్ లతోపాటు డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణాలు చేపట్టబోతున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీద్ కమిటీ చైర్మన్ నసీర్ తెలిపారు. శనివారం స్థానిక బిఆర్ స్టేడియంతోపాటు పొన్నూరు రోడ్ లో పార్క్, వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి అనువైన స్థలాన్ని నగర కమిషనర్ మయూర్ అశోక్ తో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు ఈ సందర్భంగా బీఆర్ స్టేడియంలో వాలీబాల్ కోర్టు , డ్రెయిన్ల నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం పొన్నూరు రోడ్డులోన ఖాళీ స్థలాన్ని వాకింగ్ ట్రాక్ పార్కు నిర్మాణానికి పరిశీలించారు. నల్లచెరువుతోపాటు బొంగరాల వీడు వద్ద వెల్ఫేర్ స్థలంలో వాకింగ్ ట్రాక్, పార్కులు ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. వీటిని యుద్ధప్రాతిపదికన చేపట్టి త్వరలోనే నియోజకవర్గ ప్రజలకు అందించనున్నామన్నారగుంటూరు తూర్పు నియోజకవర్గంలో ప్రజలకు ఆరోగ్యంపాటు ఆహ్లాదకరమైన వాతావరణం అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే 100 కోట్ల రూపాయలతో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం చేపట్టామని చెప్పారు. వాకింగ్ ట్రాక్ లు, పార్కుల నిర్మాణంతో ఆయా ప్రాంతాలకు కొత్త కళ వస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి సంక్షేమాన్ని ప్రతి ఒక్కరికి అందేలా పాలన సాగిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఏ చిన్న సమస్య వచ్చినా తనను సంప్రదించవచ్చని, ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే నసీర్ చెప్పారు

## అగ్నిప్రమాద బాధిత డప్పు కళాకారుడికి లంకిశెట్టి బాలాజీ చేయూత



**మచిలీపట్నం,పెన్ పవర్, సెప్టెంబర్ 25**

అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన శారదానగర్‌కు చెందిన డప్పు కళాకారుడు పులవర్తి సురేష్ కుటుంబానికి లంకిశెట్టి ఫ్రెండ్స్ సర్కిల్ అండగా నిలిచింది. శనివారం న్యాయవాది లంకిశెట్టి బాలాజీ, 15వ డివిజన్ మాజీ కౌన్సిలర్ లంకిశెట్టి వనజ దంపతులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి బట్టలు, నిత్యావసర వస్తువులు, వంట సామగ్రి, కూరగాయలు, పోషకాహారం, రూ.3 వేల నగదును అందజేశారు.31వ డివిజన్‌కు చెందిన సురేష్ తన భార్య శ్రీలక్ష్మి, వృద్ధ తల్లి సులోచన, ముగ్గురు పిల్లలతో జీవిస్తున్నాడు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో తండ్రిని కోల్పోయిన కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉండగా, సెప్టెంబర్ 15న జరిగిన అగ్నిప్రమాదంలో ఇల్లు, సామగ్రి మొత్తం దగ్ధమయ్యాయి. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ బాధిత కుటుంబానికి ప్రభుత్వ గృహ నిర్మాణ సంస్థ ద్వారా ఇంటి నిర్మాణానికి అవసరమైన సామగ్రి అందించాలని కోరారు. నగర జనసేన అధ్యక్షుడు గడ్డం రాజు మాట్లాడుతూ దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉడుముల బుజ్జి, సంఘం రాజేష్, శ్రీను, రాకేష్, కొమ్మకూరి జాకబ్, కారుమూరి కళ్యాణ్ పాల్గొన్నారు.

## ఒక్కో కుటుంబం నుంచి ఒక వ్యాపారవేత్తగా ఎదగాలి మంత్రి పెమ్మసాని





**గుంటూరు: పెన్ పవర్, సెప్టెంబర్, 26,**

ఒక్కో కుటుంబం నుంచి ఒక వ్యాపారవేత్తగా ఎదగాలనే లక్ష్యంతో మహిళలు, యువత ముందుకు రావాలని గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పిలుపునిచ్చారు.నగరంలోని ఓ సమావేశ మందిరంలో ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ‘ఒక్కో కుటుంబం--ఒక వ్యాపారవేత్త’ కార్యక్రమానికి శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

అమెరికాలో ఉన్నప్పుడు పది మంది కలిసినా ఎక్కువగా వ్యాపార అంశాలపైనే చర్చలు జరుగుతుంటాయని, ఆంధ్రప్రదేశ్‌లో కూడా వ్యాపారంపై స్పష్టమైన ఆలోచనలు, చర్చలు పెరుగుతున్నాయని మంత్రి తెలిపారు. ముఖ్యంగా మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా వ్యాపారవేత్తలుగా ఎదుగుతున్నారని పేర్కొన్నారు. వ్యాపారంలో ఉత్పత్తి నాణ్యత అత్యంత ముఖ్యమని పెమ్మసాని అన్నారు. నాణ్యత బాగుంటేనే వినియోగదారుల ఆదరణ లభిస్తుందని, ఒక ఉత్పత్తిని గుర్తుచేసుకున్నప్పుడు దాని వెనుక ఉన్న వ్యాపారవేత్త కూడా గుర్తుకు వచ్చేలా నాణ్యతను పెంచుకోవాలని సూచించారు.

అందరూ ఒకే రకమైన ఉత్పత్తులపై ఆధారపడకుండా కొత్త ఆలోచనలతో విభిన్న ఉత్పత్తులను తయారు చేయాలని తెలిపారు. వినియోగదారుల అభిప్రాయాలను తెలుసుకుని వాటికి అనుగుణంగా ఉత్పత్తుల్లో మార్పులు చేసుకోవాలని సూచించారు. వ్యాపారం ప్రారంభించిన తొలినాళ్లలో ఎలాంటి అడ్డదారులు తొక్కకుండా నాణ్యత, నమ్మకానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఉత్పత్తుల ప్రచారం, ప్యాకింగ్, విక్రయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. విక్రయ సిబ్బందిని సమర్థవంతంగా వినియోగించుకునే విధానాన్ని కూడా వ్యాపారవేత్తలు పరిశీలించాలన్నారు.

వ్యాపారాలకు రుణాలు పొందడంలో లేదా ఇతర సమస్యలు ఎదురైతే వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. స్వయం సహాయక సంఘాల నాయకులు కూడా సభ్యులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే బి. రామాంజనేయులు, జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ, జీఎంసి కమిషనర్ మయూర్ అశోక్, ఆంధ్రప్రదేశ్ సాంకేతిక సేవల సంస్థ చైర్మన్ మన్నవ మోహన కృష్ణ, జిడిసిసి జిల్లా చైర్మన్ వడ్రానం హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## చిరుధాన్యాలతో పోషకాహారం అందించాలి



**వేటపాలెం, సెప్టెంబర్ 26 (పెన్ పవర్):**

వేటపాలెం మండలం, దేశాయిపేట సెక్టార్ పరిధిలోని మంకెనవారిపాలెం అంగన్వాడీ కేంద్రం వద్ద శనివారం పోషకాహార మాసోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారులకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించే విధానంపై తల్లులకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ సజ్జ లీలావతి తల్లులకు సజ్జ బూరెలు వంటి పోషకాహార వంటకాల తయారీని ప్రత్యక్షంగా చూపించారు. చిరుధాన్యాలతో చిన్నారులకు వివిధ రకాల పోషకాహార పదార్థాలను తయారు చేసి పెట్టాలని సూచించారు. పిల్లలకు జంక్‌ఫుడ్ అలవాటు చేయకుండా, ఇంట్లోనే శుభ్రమైన, పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని ఆమె సూచించారు.చిన్నారుల ఎదుగుదల, ఆరోగ్యానికి చిరుధాన్యాలు, స్థానికంగా లభించే పోషక పదార్థాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని సజ్జ లీలావతి తెలిపారు. తల్లిదండ్రులు పోషకాహారంపై అవగాహన పెంచుకుని పిల్లల ఆరోగ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, తల్లులు పాల్గొన్నారు.

## మా ఊరికి బస్సు వేయండి సార్.... ఎ.పి.జె.విలేజ్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యులు




**గుంటూరు, పెన్ పవర్, సెప్టెంబర్, 26,**

తాడేపల్లి మండలం కొలనుకొండ గ్రామంలో 26-9-2026శనివారం ఉదయం కొలనుకొండ గ్రామంలో ఉన్న విలేజ్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ మీటింగ్ ఏర్పాటు చేయటం జరిగింది.గుడ్ షెపర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ స్వచ్ఛంద సంస్థవారి చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి అత్తోట పోతురాజు మాట్లాడుతూ కొలనుకొండ,వడ్డేశ్వరం గ్రామాల నుండి నిత్యం చాలా మంది జీవనోపాధి కొరకు, పిల్లలు ఇంటర్, డిగ్రీ , ఇంజనీరింగ్, లాంటి చదువుల కోసం విజయవాడ, మంగళగిరి, గుంటూరు తదితర పట్టణాలకు వెళుతుంటారు అయితే బైపాస్ రోడ్డు వద్ద దిగితే గ్రామంలోకి వెళ్ళటానికి చాలా ఇబ్బందిగా ఉంటుందని ఉదయం 2 ట్రిప్పులు, సాయంత్రం 2ట్రిప్పులు కొలనుకొండ, వడ్డేశ్వరం, ప్రక్కన ఉన్న ఇప్పటం గ్రామాలు కలుపుతూ బస్సు సౌకర్యం కల్పించాలని దాని వల్ల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆర్ . పిచ్చయ్య మంగళగిరి డిపో మేనేజర్ కి వినతి పత్రం అందించటం జరిగింది.47 బస్సులు కొలనుకొండ, వడ్డేశ్వరం, మీదుగా వెళ్ళే అవకాశం ఉంటుందేమో విజయవాడ డిపో 1 మేనేజర్ గారితో ఒకసారి మాట్లాడతాను అని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో, గుడ్ షెఫర్డ్ సంస్థ సిబ్బంది అత్తోట పోతురాజు కొలనుకొండ విలేజ్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యులు నెమలకంటి విజయనిర్మల,గుంపా మరియమ్మ,శిఖా తెరోజిమ్మ,తురక ఎలియ గ్రామపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## అక్టోబర్ 7న మున్సిపల్ పాత వాహనాల బహిరంగ వేలం



**నరసరావుపేట, పెన్ పవర్ సెప్టెంబర్ 26:**

నరసరావుపేట పురపాలక సంఘం పరిధిలో ఉపయోగంలో లేని పాత వాహనాల బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ నరపురెడ్డి రమ్య కీర్తన తెలిపారు.ఈ మేరకు శనివారం విడుదల చేసిన ప్రకటనలో, అక్టోబర్ 7వ తేదీ ఉదయం 11 గంటలకు నరసరావుపేట మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వ్యక్తులు వేలంలో పాల్గొని పాత వాహనాలను కొనుగోలు చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు.

వేలంలో పాల్గొనదలచిన వారు రూ.25,000 డిపాజిట్ మొత్తాన్ని డిమాండ్ డ్రాఫ్ట్, బ్యాంకర్ చెక్కు లేదా నగదు రూపంలో చెల్లించాలని సూచించారు. వేలం నిబంధనలు, వాహనాల వివరాలు మరియు ఇతర సమాచారాన్ని మున్సిపల్ కార్యాలయ పనివేళల్లో ఇంజినీరింగ్ విభాగంలో సంప్రదించి తెలుసుకోవచ్చని తెలిపారు.

ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని వేలంలో పాల్గొనాలని మున్సిపల్ కమిషనర్ కోరారు.

## మానవత్వమే నిజమైన నాయకత్వం

**చీరాల, సెప్టెంబర్ 26 (పెన్ పవర్):**

ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్న చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య మరోసారి తన సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. “ఆపదలో ఎవరైనా నా గడప తొక్కితే నేనున్నానంటూ అండగా నిలుస్తా” అనే నమ్మకాన్ని ఆచరణలో చూపిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని స్థానికులు పేర్కొన్నారు.

గుంటూరులోని ఆదిత్య మెడికేర్‌లో చికిత్స పొందుతున్న పందిళ్లపల్లి గ్రామానికి చెందిన చాపల పోతురాజు భార్య చాపల శ్రీవల్లిని ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.



అనంతరం ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారారూ.1,02,000ఆర్థికసహాయాన్ని అందజేశారు. పేదలకు వైద్య సహాయం అందించడంతో పాటు అత్యవసర చికిత్సల కోసం ఎల్‌వోసీ ద్వారా సాయం అందిస్తూ ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తున్నారని తెలిపారు.ఆపదలో ఉన్న వారికి సహాయం అందిస్తూ పేదల కష్టాల్లో భాగస్వామిగా నిలుస్తున్న ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య సేవలను పలువురు అభినందించారు. మానవత్వమే నిజమైన నాయకత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు.



## ప్రత్తిపాటి సమక్షంలో టీడీపీ గూటికి చేరిన 20 వైసీపీ కుటుంబాలు.

## వ్యక్తిగత ప్రయోజనాల కంటే, టీడీపీకి ప్రజా ప్రయోజనాలే ముఖ్యం : ప్రత్తిపాటి

**చిలకలూరిపేట , పెన్ పవర్, సెప్టెంబర్ 26 :**

కన్నతల్లిలా అన్నివేళలా కార్యకర్తలకు అండగా నిలిచే తెలుగుదేశాన్ని కాదని, గతంలో జగన్ ప్రలోభాలకు ఆశపడి, వైసీపీలో చేరిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు మరలా తమ సొంత ఇంటికి రావడం సంతోషకరమని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు.తెలుగుదేశానికి ఎప్పటికీ ప్రజాప్రయోజనాలే ముఖ్యమని, కార్యకర్తలు, నాయకులు ఈ వాస్తవాన్ని గ్రహించి మసలుకోవాలని ఆయన సూచించారు.

చిలకలూరిపేట పట్టణం 21వ వార్డుకు చెందిన 20 కుటుంబాల వారు ఇదివరకు టీడీపీలో ఉండేవారు. గతంలో వైసీపీనేతల బెదిరింపులు, ప్రలోభాలకు లొంగిపోయి, ఆనాడు వారు గొడ్డలిపార్టీలో చేరారు. వారంతా తిరిగి శనివారం ప్రత్తిపాటి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్తిపాటి.. వారందరికీ తెలుగుదేశం కండువాలు కప్పి, తిరిగి టీడీపీలోకి స్వాగతించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి వారిని ఉద్దేశించి మాట్లాడారు. వైసీపీలో ఉంటే ప్రజలకు దూరమై.. నేరాలకు దగ్గరవుతారు.



జాతీయ రాజకీయాల్లో తెలుగుదేశం పార్టీకి ఒక ప్రత్యేక, విశిష్టమైన గుర్తింపు ఉందని, బడుగు బలహీన వర్గాలు, దళితుల రాజకీయ, సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి టీడీపీ చేసిన కృషి మరే పార్టీ చేయలేదని ప్రత్తిపాటి పేర్కొన్నారు. ఉమ్మడి ఏపీ, విభజనానంతరం నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధిలో సింహభాగం టీడీపీ ప్రభుత్వాల పాలనలోనే జరిగిందని, చంద్రబాబు నాయకత్వమంటేనే ప్రగతికి మారు పేరని ప్రత్తిపాటి వ్యాఖ్యానించారు. టీడీపీ నుంచి వైసీపీలోకి వెళ్లిన వారు తామేం కోల్పోయామో తెలుసుకున్నారని, నేరాలకు దగ్గరై... ప్రజలకు దూరమై మనశ్శాంతిగా, సంతోషంగా జీవించలేకే తిరిగి టీడీపీలోకి వస్తున్నారని ఆయన చెప్పారు. కొత్తవారైనా, పాతవారైనా పార్టీ క్రమశిక్షణకు కట్టుబడే ఉండాలని, కూటమిపార్టీలను సమన్వయం చేసుకుంటూ ప్రజాక్షేత్రంలో వైసీపీతో పోరాడాలని ప్రత్తిపాటి సూచించారు. త్వరలోజరిగే స్థానిక ఎన్నికల్లో టీడీపీ శ్రేణులు ముందుండి ఎన్నికలక్షేత్రంలో మిత్ర పక్షాలైన జనసేన, బీజేపీ శ్రేణుల్ని నడిపించాలన్నారు. రాష్ట్ర..ప్రజా ప్రయోజనాల కోసం మిత్రధర్మానికి కట్టుబడి నడుచుకోవాలన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే రాష్ట్రం, ప్రజల ప్రయోజనాలే ముఖ్యమనే సత్యాన్ని టీడీపీ శ్రేణులు గుర్తించాలని ప్రత్తిపాటి హితవు పలికారు.

ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, టీడీపీ నాయకులు షేక్ మస్తాన్ వలి, కొత్త కోటేశ్వరరావు, మురకొండ మల్లిబాబు, పిల్లి కోటేశ్వరరావు, పల్లపు కళ్యాణి, సురేంద్ర, ఘని, శేషు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రామానగరం క్లబ్ రోడ్ యూత్ ఆధ్వర్యంలో ఎస్సై గారికి ఘన సన్మానం - వందలాది మందికి అన్నదానం

**చల్లపల్లి పెన్ పవర్ సెప్టెంబర్ 26**

చల్లపల్లి మండలం రామానగరం గ్రామంలో వినాయక చవితి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. రామానగరం క్లబ్ రోడ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద శనివారం రెండు గొప్ప కార్యక్రమాలు నిర్వహించి యువత ఔదార్యాన్ని చాటుకున్నారు.

పోలీస్ శాఖకు కృతజ్ఞతగా ఎస్సై గారికి సన్మానం:

గ్రామంలో గత కొన్ని రోజులుగా జరుగుతున్న గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు ఎటువంటి గొడవలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అహర్నిశలు కష్టపడిన పోలీస్ శాఖకు కృతజ్ఞతగా, స్థానిక ఎస్సై గారిని క్లబ్ రోడ్ యూత్ సభ్యులు ఘనంగా సన్మానించారు.

గణేష్ మండపం వద్ద ఏర్పాటు చేసిన వేదికపై ఎస్సై గారికి శాలువా కప్పి, పూలమాల వేసి సత్కరించారు. “శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర మరువలేనిది. పండుగ సమయంలో మాకు అండగా నిలిచిన పోలీస్ శాఖకు మా యూత్ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు” అని యూత్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై గారు మాట్లాడుతూ యువత ఇలా సేవా మార్గంలో నడవడం అభినందనీయమని, గ్రామ అభివృద్ధికి యువత ముందుకు రావాలని



పిలుపునిచ్చారు.

రెండు వేల మందికి మందికి అన్నదానం - బారులు తీరిన భక్తులు

అనంతరం మండపం వద్ద ఏర్పాటు చేసిన భారీ అన్నదాన కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. ఉదయం నుండే వంటలు ప్రారంభించి, మధ్యాహ్నం 12 గంటల నుండి భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

ఈ అన్నదాన కార్యక్రమానికి చల్లపల్లి, రామానగరం, పరిసర గ్రామాల నుండి వృద్ధులు, మహిళలు, చిన్నారులు, భక్తులు వందలాదిగా తరలివచ్చారు. ఎండను సైతం లెక్కచేయకుండా క్యూ లైన్లో నిలబడి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. క్లబ్ రోడ్ యూత్ సభ్యులు స్వయంగా వడ్డిస్తూ, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకున్నారు.

అన్నదానం చేయడం వల్ల మించిన పుణ్యం లేదని,





గణనాథుని ఆశీస్సులతో ప్రతి ఏటా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని యూత్ అధ్యక్షులు తెలిపారు.

క్లబ్ రోడ్ యూత్ చేస్తున్న సేవా కార్యక్రమాలను గ్రామ పెద్దలు, గ్రామస్తులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో క్లబ్ రోడ్ యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నేర నియంత్రణే లక్ష్యం.. పెద్దచెరువులో విస్తృత కార్డన్ అండ్ సెర్చ్

## పెద్దచెరువులో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించిన పల్నాడు జిల్లా పోలీసులు

**నరసరావుపేట, పెన్ పవర్ సెప్టెంబర్ 26:**

శాంతిభద్రతల పరిరక్షణ, చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిర్మూలన, నేర నియంత్రణ లక్ష్యంగా పల్నాడు జిల్లా పోలీసులు శనివారం నరసరావుపేట 2 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 25వ వార్డు పెద్దచెరువులో విస్తృత స్థాయిలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ జగదీష్ ఆదహళ్లి ఆదేశాల మేరకు నరసరావుపేట ఉపవిభాగ పరిధిలో ఉదయం నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని డీఎస్పీ ఎం. హనుమంతరావు పర్యవేక్షించారు. సంఘ వ్యతిరేక శక్తులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు, ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారిని గుర్తించి చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించేందుకు ఈ తనిఖీలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



ఈ సందర్భంగా పోలీసు అధికారులను, సిబ్బందిని ప్రత్యేక బృందాలుగా విభజించి రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్లు, పాత కేసుల నిందితులపై ప్రత్యేక నిఘా పెట్టారు. వారి ఇళ్లతో పాటు పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో సరైన పత్రాలు లేని 52 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించిన పోలీసులు పెద్దచెరువు ప్రాంత ప్రజలతో సమావేశమై పలు అంశాలపై అవగాహన కల్పించారు. హెల్మెట్ వినియోగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలు, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల జరిగే అనర్థాలపై ప్రజలకు వివరించారు. ప్రాంతంలో అపరిచిత వ్యక్తులు సంచరిస్తే వెంటనే 112కు సమాచారం అందించాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగానే ఈ కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. అలాగే రౌడీషీటర్లు, అనుమానితులు, పాత కేసుల నిందితులపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని వెల్లడించారు.

పాత కేసుల నిందితులతో సమావేశమైన పోలీసులు గత తప్పిదాలను పునరావృతం చేయకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. అకారణంగా గొడవలు సృష్టించినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో నరసరావుపేట 2 టౌన్ సీఐ ప్రభాకర్, నరసరావుపేట రూరల్ సీఐ ఎం.వి. సుబ్బారావు, చిలకలూరిపేట టౌన్ సీఐ రమేష్,



చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బానాయుడు, వినుకొండ రూరల్ సీఐ బ్రహ్మయ్యతో పాటు నరసరావుపేట ఉపవిభాగానికి చెందిన ఎస్సైలు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# యువత భవితకు భరోసా కార్యక్రమంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

**నరసరావుపేట, పెన్ పవర్ సెప్టెంబర్ 26:**
మారుతున్న సాంకేతిక ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకొని భవిష్యత్తుఅవకాశాలనుఅందిపుచ్చుకోవాలనినరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు సూచించారు. యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పిస్తూ వారి భవిష్యత్తుకు భరోసా కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.








రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'యువత భవితకు భరోసా' కార్యక్రమంలో భాగంగా శనివారం నరసరావుపేటలోని శ్రీ సుబ్బరాయ మరియు నారాయణ కళాశాల, పాలడుగు నాగయ్య చౌదరి మరియు రఘురామయ్య కళాశాల, ఎంఏఎం ఇంజినీరింగ్ కళాశాల, కృష్ణవేణి డిగ్రీ కళాశాలల్లో నిర్వహించిన సదస్సుల్లో ఎంపీ ముఖ్య అతిథిగాపాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒకప్పుడు డిగ్రీ విద్యతోనే ఉద్యోగ అవకాశాలు లభించేవని, అయితే ప్రస్తుత పోటీ ప్రపంచంలో అదనపు నైపుణ్యాలు, ప్రత్యేక కోర్సులు నేర్చుకోవడం అవసరమైందన్నారు. క్లౌడ్ టెక్నాలజీ, డేటా విశ్లేషణ, రోబోటిక్స్, కృత్రిమ మేధస్సు, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి ఆధునిక సాంకేతిక రంగాల్లో విద్యార్థులు ప్రావీణ్యం సాధించాలని సూచించారు. సాంకేతికత వల్ల ఉద్యోగాలు తగ్గిపోతాయనే అపోహలకు తావులేదని, కృత్రిమ మేధస్సు వంటి సాంకేతిక సాధనాలను సమాజ సమస్యలకు వినూత్న పరిష్కారాలు కనుగొనే దిశగా వినియోగించాలన్నారు. యువత తమ ఆలోచనా విధానాన్ని విస్తరించుకుని ప్రపంచ స్థాయి అవకాశాలను అందిపుచ్చుకోవాలనిపిలుపునిచ్చారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం కృషి చేస్తున్న యువతకు పూర్తి భరోసా ఇస్తూ, నియామక ప్రక్రియలు పారదర్శకంగా, ప్రతిభ ఆధారంగానే నిర్వహించబడతాయని తెలిపారు. యువత భవిష్యత్తు భద్రతకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులు భవిష్యత్తులో మరిన్ని ఉద్యోగ అవకాశాలకు దోహదపడతాయని పేర్కొంటూ, విద్యార్థులు కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. సామాజిక మాధ్యమాలను వ్యక్తిగత అభివృద్ధి, సమాజ హిత కార్యక్రమాల కోసం వినియోగించాలని కోరారు. అలాగే సమాజంపైఅవగాహన పెంపొందించుకుంటూ మహాత్మా గాంధీ ఆశయాలకు అనుగుణంగా జీవించాలని విద్యార్థులకు సూచించారు.

ఈ కార్యక్రమాల్లో కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఏపీడబ్ల్యూజేఎఫ్, ఏపీబీజేఏ పల్నాడు జిల్లా ప్రథమ మహాసభలకు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి ఆహ్వానం

**నరసరావుపేట, పెన్ పవర్ సెప్టెంబర్ 26:**
ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్), ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్ (ఏపీబీజేఏ) సంయుక్త ఆధ్వర్యంలో అక్టోబర్ 11న నరసరావుపేట పట్టణంలోని ఐఎంఏ హాల్‌లో నిర్వహించనున్న పల్నాడు జిల్లా ప్రథమ మహాసభలకు పల్నాడు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని ప్రముఖ పాత్రికేయులు ఆహ్వానించారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆహ్వాన సంఘం ప్రతినిధులు శనివారం డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి మహాసభలకు ప్రత్యేక అతిథిగా హాజరుకావాలని కోరుతూ ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, పల్నాడు జిల్లా ఏర్పాటైన అనంతరం జర్నలిస్టుల ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో ప్రథమ మహాసభలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి, సమాజానికి దిశానిర్దేశం చేసే జర్నలిస్టుల సేవలు అమూల్యమైనవని పేర్కొన్నారు.



జర్నలిస్టులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. నరసరావుపేటలో జరగనున్న ఈ మహాసభలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ నిర్వాహకులను అభినందించారు. జర్నలిస్టుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం మరింత దృష్టి సారించాలని కోరుతూ, పాత్రికేయులకు తన పూర్తి సహకారం, అండదండలు ఎల్లప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లాకు చెందిన ప్రముఖ పాత్రికేయులు, జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# బధిరుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అన్ని విధాలా సహకారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ

**విజయవాడ, పెన్ పవర్,సెప్టెంబర్ 26:**
బధిరులుఎదుర్కొంటున్నసమస్యలపరిష్కారానికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ తెలిపారు. ప్రపంచ బధిరుల దినోత్సవం, సంజ్ఞల భాషా దినోత్సవం సందర్భంగా జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విజయవాడ ఫార్మర్స్ ట్రైనింగ్ సెంటర్‌లో శనివారం జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బధిరులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడంలో ఎలాంటి సంకోచం చెందాల్సిన అవసరం లేదన్నారు. వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బధిరులకు సమాజంలో సమాన అవకాశాలు




కల్పించడంతో పాటు వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. బధిరుల అవసరాలకు అనుగుణంగా అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు.

కార్యక్రమానికి ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలోని వివిధ బధిరుల సంఘాల ప్రతినిధులు, సభ్యులు, డెఫ్ ఎనేబుల్ ఇండియా సంస్థ ప్రతినిధులు హాజరయ్యారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 200 మంది బధిరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా బధిరుల ప్రతిభను ప్రోత్సహించేలా వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఇద్దరు బధిరులకు టచ్ ఫోన్లు, ఐదుగురికి వినికిడి యంత్రాలు కలిపి మొత్తం రూ.50 వేల విలువైన ఉపకరణాలను అందజేశారు.

కార్యక్రమంలో జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు వాడ్రేవు కామరాజు, అధికారులు, సంక్షేమ శాఖ సిబ్బంది, వివిధ సంఘాల ప్రతినిధులు, పాఠశాలల సిబ్బంది, ఇన్ఫైట్ ఇండియా సంస్థ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. బధిరుల సంక్షేమం, వారి హక్కులు, వారికి అందాల్సిన సహాయ సహకారాలపై అవగాహన కల్పించారు.

# ఎస్సీ ఎస్టీ కేసులో బాధితుడైన ప్రవీణ్ కు ప్రభుత్వం తరఫున ఏకరం పొలం కేటాయించాలి.



గతంలో కలెక్టర్ అనుమతులు ఇచ్చిన పట్టించుకోని దాచేపల్లి తహసిల్దార్.

**నరసరావుపేట, పెన్ పవర్ సెప్టెంబర్ 26.**
వికలాంగుడైన ప్రవీణ్ కు న్యాయం చేయాలని ఆ కుటుంబానికి ప్రభుత్వం ఎకరం భూమి కేటాయించాలని ఎమ్మార్పీఎస్ ఎస్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు చింతిరాల మీరయ్య మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

శనివారం నరసరావుపేట కలెక్టరేట్ లో జరిగిన ఎస్సీ, ఎస్టీ ప్రజా పరిష్కార వేదిక లో డిఆర్ఓ కి వినతి పత్రం సమర్పించారు. దాచేపల్లి మండలం శ్రీనగర్ కాలనీకి చెందిన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు బాధితుడు కొమ్మువరపు ప్రవీణ్ కుమార్ వికలాంగుడకు ఎకరం పొలం కేటాయించాలని డిఆర్ఓ ని కోరడం జరిగినది. ఈ సందర్భంగా డిఆర్ఓ దాచేపల్లి తాసిల్దార్ తో మాట్లాడి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు బాధితుడు మరియు వికలాంగులైన కొమ్మువరపు ప్రవీణ్ కి విచారణ జరిపి ఎకరం పొలం కేటాయించే లాగున ఆదేశాలు జారీ చేయడం జరిగినది. ఈ సందర్భంగా మీరయ్య మాదిగ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులో వికలాంగులైన కొమ్ము వరకు ప్రవీణ్ కి ఘటన జరిగిన తర్వాత అప్పట్లో కలెక్టర్ బాధితులకి ఎకరం పొలం ఇచ్చే విధంగా చూడాలని అప్పట్లో తాసిల్దారి కి ఆదేశాలు జారీ చేయడం జరిగినది కానీ అప్పటినుంచి కూడా ఇంతవరకు దాచేపల్లి తాసిల్దారు దగ్గర జాప్యం జరుగుతూనే ఉందని తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఎస్సీ మాదిగ కులానికి చెందిన ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని వారు కోరారు. ఎమ్మార్పీఎస్ఎస్ తరుపున ప్రభుత్వానికి డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ఎస్ వినుకొండ నియోజకవర్గం నాయకులు సురభి కోటేశ్వరరావు , చిలకలూరిపేట నాయకులు బొంత వేణు, నరసరావుపేట మండల నాయకులు ప్రశాంతి రాజు, మరియు ఎమ్మార్పీఎస్ఎస్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు..

# సర్ ప్రక్రియపై జగన్ వ్యాఖ్యలపై మర్రి రాజశేఖర్ ఫైర్..!!
## కోర్టులో ఒకటి, బయట ఇంకొకటి

**చిలకలూరిపేట , పెన్ పవర్, సెప్టెంబర్ 26 :**
సర్ ప్రక్రియపై వైఎస్సార్సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్ తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్ ప్రక్రియలో అధికార పార్టీ అధికార దుర్వినియోగం చేసిందని జగన్మోహన్ రెడ్డి తమ ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారని, అయితే ఈ మాటలు ఎంత సత్యదూరమో వారి పార్టీకి చెందిన ఎమ్మెల్సీ అప్పిరెడ్డి చేత సర్ ప్రక్రియ ప్రకారం తయారు చేసిన ఓటర్ లిస్ట్ ప్రకారమే లోకల్ బాడీ ఎన్నికలు జరపాలని చెప్పి హైకోర్టులో రిట్ వేయించారని గుర్తు చేశారు.అక్కడ సర్ ప్రక్రియ ప్రకారం తయారు చేసిన ఓటర్ లిస్ట్ ప్రకారం ఎన్నికలు జరపాలని హైకోర్టులో రిట్ వేయించి,మరలా ఇప్పుడు అధికార పార్టీ అధికార దుర్వినియోగం చేసిందని చెప్పడంలో ఎటువంటి క్లారిటీ లేదని మర్రి రాజశేఖర్ ప్రశ్నించారు.

గత ఎన్నికలప్పుడు మీరు ఆడింది ఆట, పాడింది పాటగా ఉంటుందని ఆరోజు సపోర్ట్ ఇచ్చారా? ఈరోజు బండితిరగబడే సరికి మరలా ఇంకొక రకమైన స్టాండ్ తీసుకుంటున్నారా? అని ఆయన మండలిలో ప్రశ్నించారు.అలాగే, చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియాను



కమిటీ లోనుండి తొలగిస్తూ, లోక్సభలో,రాజ్యసభలో పరీక్షరాసేవాడేఇన్విజిలేటర్ను నియమించుకుంటున్నాడనే విషయం మీకు తెలిసే ఆ రోజు మద్దతు ఇచ్చారు కదా.మరి ఈరోజు ఆ మాట ఇప్పుడు ఎందుకు అంటున్నారు? ఇప్పుడు కొత్తగా ఏమైందని, ఎప్పటికీ ఏది అవసరమైతే అదేనా మాట్లాడేది అని ప్రశ్నించారు.మీరు ఎప్పుడూ కూడా ప్రజలకు ఏది మేలు జరుగుతుందో అది చేయరు.మీ స్వప్రయోజనాలు నెరవేరతాయనే ఉద్దేశంతో ఆరోజు మీరు సపోర్ట్ ఇచ్చారు. ఈరోజు సర్ ప్రక్రియలో అధికార దుర్వినియోగం జరిగిందని కొత్త పల్లవి అందుకున్నారు. కోర్టులోనేమో సర్ ప్రక్రియ ప్రకారం ఎన్నికలుజరపమంటారు. బయటకు వచ్చేమో అధికార పార్టీ అధికార దుర్వినియోగం చేశారని అంటారు. దీనికి మీరు సమాధానం చెప్పాలని మర్రి రాజశేఖర్ డిమాండ్ చేశారు.ఇంతకు పూర్వం ఓటర్ లిస్టు ప్రకారం కాకుండా సర్ ప్రక్రియతో తయారు చేసిన ఓటర్ లిస్ట్ ప్రకారం ఎన్నికలు జరపమని హైకోర్టులో అడుగుతున్నారు కదా, దాని భావం ఏంటి? ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం సర్ ప్రక్రియ చాలా చక్కగా నిర్వహించిందని, ఎలక్షన్ కమిషన్కి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించిందని మీ ఉద్దేశమేనా? ఆ ఉద్దేశంతోనే కోర్టులో రిట్ వేశారా? అని ప్రశ్నించారు.మీరు గందరగోళంలో ఉన్నారు. ప్రజలను కూడా గందరగోళంలో పడవేయాలని చూస్తున్నారు. మీ తప్పులను కప్పిపుచ్చుకోవడం కోసం ఈ రకమైన మాటలు మాట్లాడుతూ ఉన్నారు. ఇది కరెక్ట్ కాదని మర్రి రాజశేఖర్ హితవు పలికారు.

# ఓటర్ల జాబితా లోటుపాట్లను సరిచేయాలి





**చీరాల, సెప్టెంబర్ 26 (పెన్ పవర్):**
చీరాల పురపాలక సంఘంలో నూతనంగా ఏర్పడిన 44 వార్డుల సరిహద్దులు, ఓటర్ల జాబితాలో ఉన్న లోటుపాట్లను సరిచేయాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ బాబు ఆదేశాల మేరకు పట్టణ అధ్యక్షుడు యాతం మేరీ బాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

జీవో ఎంఎస్ నంబర్ 32 ప్రకారం వార్డుల సరిహద్దులను నిర్ణయిస్తూ, వాటికి అనుగుణంగా డోర్ నంబర్ల ఆధారంగా ఓటర్ల జాబితా రూపొందిస్తున్నట్లు అధికారులు చెబుతున్నప్పటికీ, ఒక వార్డును మూడు వార్డులుగా విభజించిన సందర్భాల్లో డోర్ నంబర్ల క్రమబద్ధీకరణలో పొంతన లేకుండా జాబితాలు ప్రచురించారని వైఎస్సార్‌సీపీ నాయకులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. 1వ వార్డు నుంచి 44వ వార్డు వరకు పలు వార్డుల్లో ఉన్న సమస్యలను ఆధారాలతో అధికారులకు వివరించారు.

ప్రత్యేకంగా 1 నుంచి 10, 22 నుంచి 27, 40 నుంచి 44 వార్డుల పరిధిలో వార్డు హద్దుల నియమావళికి అనుగుణంగా డోర్ నంబర్లను వరుస క్రమంలో క్రమబద్ధీకరించలేదని పేర్కొన్నారు. దీంతో ఓటర్ల జాబితా శాస్త్రీయంగా రూపొందలేదని, దీనిపై సమగ్రంగా పరిశీలించి లోటుపాట్లను సరిచేసి న్యాయం చేయాలని కోరారు. ఇందుకు సంబంధించిన ఆధారాలను కూడా కమిషనర్‌కు సమర్పించారు.

ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బొనిగల జైసన్ బాబు, మాజీ కౌన్సిలర్లు చీమకుర్తి బాలకృష్ణ, బత్తుల అనిల్, గుంటూరు ప్రభాకర్ రావు, బూత్ లెవెల్ నియోజకవర్గ ప్రతినిధి సిక్కా సురేష్, బాపట్ల జిల్లా యువజన విభాగ ఉపాధ్యక్షులు, కోఆప్షన్ సభ్యులు గూడూరి ప్రసాద్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు చెల్లి బాబురావు, కంచర్ల చక్రవర్తి, తొట్టెంపూడి ఇన్నయ్య, సల్లూరి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# పేటలో 'పేలుతున్న' అధికారుల నిర్లక్ష్యం... ప్రాణాలు పోతేనే తనిఖీలా?

**చిలకలూరిపేట , పెన్ పవర్, సెప్టెంబర్ 26 :**
చిలకలూరిపేట జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న పసుమర్తి, బొప్పిడి పరిధిలోని దీపావళి బాణాసంచా దుకాణాలపై ఇప్పుడు అధికారుల జాయింట్ టాస్క్ ఫోర్స్ వాలిపోయింది. రెవిన్యూ, పోలీస్, లేబర్, ఫైర్ సేఫ్టీ అధికారులు సమన్వయంతో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలంటూ హడావుడిగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. అయితే, ఈ హడావుడి చూస్తున్న సామాన్యుడి మదిలో మెదులుతున్న ప్రశ్న ఒక్కటే... "ప్రమాదాలు జరిగి ప్రాణాలు గాలిలో కలిశాకే ఈ అధికారులకు నిద్ర మెలకువ వస్తుందా? చేసిన తనిఖీల్లో దొరికిన వాస్తవాలైనా బయటపెడతారా లేక వాటిని కూడా బూడిదలో కలిపేస్తారా?"



సెప్టెంబర్ 18వ తేదీన కె.ఎస్.ఎస్ ఫైర్ వర్క్స్ కేంద్రంగా జరిగిన ఘోర ప్రమాదం ఇంకా కళ్లముందే కదలాడుతోంది. సుమారు రూ. 40 లక్షల పైచిలుకు విలువైన సరుకు అగ్నికి ఆహుతైంది. దుకాణ యజమాని సురేష్ ప్రాణాలు కోల్పోగా, మరో వ్యక్తి తీవ్ర గాయాలపాలై ఆసుపత్రి పాలయ్యాడు. ఒక నిండు ప్రాణం బలై, లక్షల కొద్దీ ఆస్తి నష్టం జరిగిన తర్వాత గానీ అధికార యంత్రాంగంలో కదలిక రాలేదు. తీరా తీరికగ్గా ఇప్పుడు తనిఖీల పేరుతో హడావుడి చేస్తున్నారు. అసలు ఈ దుకాణాల నిర్వాహకులు ఏ నిబంధనలు పాటిస్తున్నారు? భద్రతా ప్రమాణాలు ఎక్కడైనా అమలవుతున్నాయా? అంటే ఎవరి వద్దా సమాధానం లేదు. దశాబ్దాలుగా ఇక్కడే తిష్టవేసి వ్యాపారం చేస్తున్న ఒక వ్యాపారికి, కనీసం దీపావళి బాణాసంచా నిల్వ ఉంచే నిల్వ గోడౌన్ పర్మిషన్ కూడా లేదు! అనుమతులు లేకుండానే ఏళ్ల తరబడి పండుగ సీజన్లలో లక్షల వ్యాపారం యథేచ్ఛగా, ఎవరికీ భయం లేకుండా సాగిపోతోంది.

ఇదంతా అధికారులకు తెలియకుండానే జరుగుతోందా? లేక అందరికీ అన్నీ తెలిసిపోయి, చోద్యం చూస్తున్నారా? జిల్లా స్థాయి అధికారుల పర్యవేక్షణ వ్యవస్థ ఎక్కడ పడుకుంది? అసలు పర్యవేక్షణ అనే పదానికి ఇక్కడ అర్థం ఉందా? అని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల కనుసన్నల్లోనే ఈ అక్రమ దందా నడుస్తోందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

ఇప్పటికైనా జరుగుతున్న ఈ సంయుక్త తనిఖీలు తూతూ మంత్రంగా ముగిస్తారా? లేక నిబంధనలు తుంగలో తొక్కిన వారిపై ఉక్కుపాదం మోపుతారా? అన్నది వేచి చూడాలి. అమాయకుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న అక్రమ గోదాములకు సీల్ వేయకపోతే... ఈ తనిఖీలు కూడా కేవలం 'ప్రమాదం జరిగినప్పుడు అధికారులు ఆడే కంటితుడుపు 'గానే మిగిలిపోక తప్పదు.

# అర్.టి.సి బస్టాండ్ రూపురేఖలు మార్చే దిశగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుంది: ప్రత్తిపాటి

**చిలకలూరిపేట , పెన్ పవర్, సెప్టెంబర్ 26 :**
తెలుగుదేశం పార్టీ అనుబంధ సంఘమైనటువంటి కార్మిక పరిషత్ యూనియన్ టి.యన్.టి.యు.సి. ఆధ్వర్యంలో చిలకలూరిపేట ఏపీ.ఎస్.ఆర్.టి.సి. బస్టాండ్ లో 20 సీలింగ్ ఫ్యాన్లు 30 పూల కుండీలను మాజీమంత్రి , శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు చేతుల మీదుగా బస్ స్టాండ్ డి.యం కి అందజేయటం జరిగింది. ఈ సందర్భంగా డి.యం కార్యాలయంలో సమావేశంలో పాల్గొని వారు మాట్లాడుతూ చిలకలూరిపేట బస్టాండ్ రూపురేఖలు మార్చటానికి ప్రత్తిపాటి ఎంతో దోహదం చేస్తున్నారని యూనియన్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, రాష్ట్ర టి.యన్.టి.యు.సి. ఉపాధ్యక్షులు కంచర్ల శ్రీనివాసరావు, కార్మిక పరిషత్ టి.యన్.టి.యు.సి. యూనియన్ డిపో సెక్రటరీ అద్దంకి వరప్రసాదరావు, డి.యం వేణు, కమిటీ సభ్యులు, నాయకులు, తదితరులు పాల్గొనడం జరిగింది.



# 44 వార్డుల ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు స్వీకరణ


ఆర్.ఓ.సి.నం. 1825/2026/జీ1, తేదీ: 26.09.2026

చీరాల పురపాలక సంఘం
పత్రిక ప్రకటన

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం మరియు రాష్ట్ర ఎన్నికల అధికారి & కమీషనర్ మరియు డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆంధ్రప్రదేశ్ అమరావతి వారు మరియు ప్రభుత్వ ఉత్తర్వులననుసరించి చీరాల పురపాలక సంఘమునకు సంబంధించి 1 నుండి 44 వార్డులకు గాను ఎస్.టి, ఎస్.సి, బి.సి. మరియు మహిళా ఓటర్లను గుర్తించి, ముసాయిదా ఓటర్ల జాబితా నందు మార్పు చేసి, సంబంధిత నిబంధనల ప్రకారం ప్రజలకు అందుబాటులో చీరాల పురపాలక సంఘ కార్యాలయము మరియు తహశీల్దారు వారి కార్యాలయం, చీరాల మరియు రెవెన్యూ డివిజనల్ అధికారి, చీరాల వారి కార్యాలయముల యందు ప్రజల పరిశీలనార్థం ప్రచురించడమైనది.

సదరు చీరాల పురపాలక సంఘమునకు సంబంధించి 1 నుండి 44 వార్డులకు గాను ఎస్.టి, ఎస్.సి, బి.సి. మరియు మహిళా ఓటర్లను మార్పుచేసిన ముసాయిదా ఓటర్ల జాబితా నందు సలహాలు, సూచనలు లేదా ఏదేని అభ్యంతరాలు ఉన్నయెడల, ఫారం 2 లేదా 3లో తేది.28.09.2026 లోగా కార్యాలయ పని వేళలలో వ్రాత పూర్వకంగా కమీషనర్, చీరాల పురపాలక సంఘం వారికి తెలియపరచవలసినదిగా తెలియజేయడమైనది.

సహాయ ఎన్నికల అధికారి & కమీషనరు
చీరాల పురపాలకసంఘం.



**చీరాల, సెప్టెంబర్ 26 (పెన్ పవర్):**
చీరాల పురపాలక సంఘం పరిధిలో నూతనంగా ఏర్పడిన 44 వార్డులకు సంబంధించిన ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులు తదితర అంశాలపై ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు చీరాల పురపాలక సంఘం ప్రకటించింది.
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల అధికారి, మున్సిపల్ పరిపాలన శాఖ కమిషనర్ మరియు డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆదేశాల మేరకు 1 నుంచి 44 వార్డులకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్లకు సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితాను రూపొందించినట్లు అధికారులు తెలిపారు.ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు లేకపోవడం, తప్పులు ఉండటం, వార్డు మార్పులు తదితర అభ్యంతరాలను ప్రజలు సమర్పించవచ్చని పేర్కొన్నారు. ఈ మేరకు సెప్టెంబర్ 28, 2026లోగా సంబంధిత కార్యాలయంలో తమ అభ్యంతరాలను తెలియజేయాలని సూచించారు.ప్రజలు ఓటర్ల జాబితాను పరిశీలించి, తమ పేరు, వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలని అధికారులు కోరారు.

# చిలకలూరిపేటలో నూతన పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



**చిలకలూరిపేట , పెన్ పవర్, సెప్టెంబర్ 26 :**
చిలకలూరిపేట, సెప్టెంబర్ 26: చిలకలూరిపేట పురపాలక సంఘం పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన 48 వార్డులకు సంబంధించి 96 పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు సంబంధించిన డ్రాఫ్ట్ జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. పురపాలక సంఘం కమిషనర్ పి. శ్రీహరిబాబు ఆధ్వర్యంలో కమిషనర్ ఛాంబర్‌లో ఈ సమావేశం జరిగింది.
ఇటీవల పురపాలక సంఘం అధికారులు 48 వార్డులకు సంబంధించిన 96 పోలింగ్ స్టేషన్ల డ్రాఫ్ట్ జాబితాను విడుదల చేశారు. ఈ జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ అభిప్రాయాలు, అభ్యంతరాలను తెలియజేయాలని అధికారులు సూచించారు. ఈ నేపథ్యంలో జరిగిన సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొని ఆయా వార్డుల్లో పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుపై చర్చించారు.
ప్రతి వార్డుకు ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ స్టేషన్లు సాధ్యమైనంత వరకు ఒకే ప్రాంతంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని రాజకీయ పార్టీల ప్రతినిధులు కోరారు. అలాగే ప్రజలకు సౌకర్యవంతంగా ఉండే ప్రాంతాల్లో పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని సూచించారు.
ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ ప్రతినిధులు పఠాన్ సమద్ ఖాన్, మురకొండ మల్లిబాబు, అజహారుద్దీన్ 4, 5, 14, 17, 31, 32, 33 వార్డులకు సంబంధించిన పోలింగ్ స్టేషన్ల ఏర్పాటులో మార్పులు చేయాలని కోరుతూ తమ అభిప్రాయాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో వచ్చిన సూచనలు, అభ్యంతరాలను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు.

# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలి రెండో విడతలో జగిత్యాల నియోజకవర్గానికి 2,000 ఇళ్లు మంజూరు..
## --ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

**, సెప్టెంబర్ 26 (పెన్ పవర్):**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం రెండో విడతలో జగిత్యాల నియోజకవర్గానికి 2,000 ఇళ్లు మంజూరైన నేపథ్యంలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్ అధికారులకు సూచించారు.జగిత్యాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవోలతో ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రెండో విడతలో మంజూరైన ఇళ్లకు అర్హులైన లబ్ధిదారులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిబంధనల ప్రకారం ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.
బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు కేటాయించిన కోటా ప్రకారం అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని తెలిపారు. ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు.
అలాగే మొదటి విడతలో జగిత్యాల నియోజకవర్గానికి మంజూరైన 3,500 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిని సమీక్షించారు. నిర్మాణంలో



ఉన్న ఇళ్ల పనులను త్వరితగతిన పూర్తి చేసేలా మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవోలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. హౌసింగ్ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ లబ్ధిదారులకు అవసరమైన సహకారం అందించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో కమిషనర్ సత్య ప్రణవ్, ఎంపిడిఓ లు రమాదేవి, చిరంజీవి,వాసవి, భీమేష్,నీరజ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాల జిల్లాలో గణేష్ నవరాత్రి ఉత్సవాలలో కష్టపడి విధులు నిర్వర్తించిన అధికారులు,సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



**సెప్టెంబర్ 26 (పెన్ పవర్):**
జగిత్యాల జిల్లాలో ఈ నెల 14వ తేదీన ప్రారంభమైన గణేష్ నవరాత్రి ఉత్సవాలు జిల్లాలో ప్రశాంతంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సమిష్టి కృషితో నిమజ్జనాన్ని ప్రక్రియ పూర్తి చేయడం జరిగింది అని జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్ తెలిపారు. జిల్లాలో 3500 పైగా గణేష్ మండపాల నుండి విగ్రహాలు శాంతియుత వాతావరణంలో నిమజ్జనం చేయబడ్డాయిని నిమజ్జన ప్రాంతాల్లో పోలీసులు, రెవెన్యూ, మున్సిపల్, అగ్నిమాపక, ఆరోగ్యశాఖలు సిబ్బంది సహకారంతో సమన్వయంగా పనిచేయడం వల్ల ఎటువంటి ఇబ్బందులు తలెత్తలేదని ఎస్పీ అన్నారు. గడిచిన 11 రోజులపాటు 24 గంటలు పని చేసిన పోలీస్ అధికారులు, క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది యొక్క కృషి వల్లనే గణేష్ ఉత్సవాలను విజయవంతంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహించుకున్నామని దీనికి కృషి చేసిన పోలీస్ అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. అదేవిధంగా నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణలో ట్రాన్స్‌జెండర్స్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సక్రమంగా విధులు నిర్వర్తించి తమ వంతు పాత్ర పూర్తి చేసినందుకు అభినందనలు తెలియజేశారు.జిల్లా ప్రజలు, మండపాల నిర్వాహకుల సహకారం వల్ల గణేష్ ఉత్సవాలు,నిమజ్జనం



ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండ సాఫీగా ముగిసిందని ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు, మండపాల నిర్వాహకులకు ఎస్పీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ రాబోవు రోజుల్లో జరిగే పండుగలను ఇదే స్ఫూర్తితో జరుపుకోవాలని కోరారు.

# ఐదు రోజుల పని విధానం అమలు చేయాలి

-28, 29, 30 తేదీల్లో దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగుల సమ్మె

-యూఎఫ్‌బీయూ నేతల వెల్లడి

**చీరాల, సెప్టెంబర్ 26 (పెన్ పవర్):**
బ్యాంకింగ్ రంగంలో వారానికి ఐదు రోజుల పని విధానాన్ని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28, 29, 30 తేదీల్లో దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగులు సమ్మె నిర్వహించనున్నట్లు బాపట్ల జిల్లా బ్యాంక్ ఎంప్లాయీస్ కోఆర్డినేషన్ కమిటీ కార్యదర్శి జి. బ్రహ్మయ్య తెలిపారు.
చీరాలలోని స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ ఆర్థిక వ్యవస్థకు బ్యాంకింగ్ రంగం వెన్నెముక వంటిదని, బ్యాంకు ఉద్యోగులు




చాలాకాలంగా వారానికి ఐదు రోజుల పని విధానాన్ని అమలు చేయాలని కోరుతున్నారని తెలిపారు.ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ)తో ద్వైపాక్షిక ఒప్పందం కుదిరి సుమారు 30 నెలలు గడిచినా ఇప్పటివరకు అమలులోకి రాకపోవడం విచారకరమన్నారు. డిమాండ్ సాధన కోసం ఉద్యోగ సంఘాలు ఇప్పటికే పలు దశల్లో ధర్నాలు, ఆందోళనలు నిర్వహించినప్పటికీ ఆశించిన స్పందన లభించలేదని పేర్కొన్నారు.
రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నాబార్డు తదితర ఆర్థిక సంస్థల్లో ఐదు రోజుల పని విధానం అమలవుతున్నందున బ్యాంకు ఉద్యోగులకు కూడా అదే విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. మూడు రోజుల సమ్మె కారణంగా ఖాతాదారులకు కొంత అసౌకర్యం కలిగే అవకాశం ఉన్నప్పటికీ, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్‌ను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని తక్షణమే పరిష్కరించాలని కోరారు.
ఐబీఏతో కుదిరిన ఒప్పందాన్ని అమలు చేయకపోతే అక్టోబర్ 26 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్లే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు బ్రహ్మయ్య తెలిపారు. సమావేశంలో గద్దె దీవెన్‌బాబు, తురకపల్లి శ్రీనివాసరావు, మల్లెల దాసు, చెన్నపాలెం వాసు తదితర బ్యాంకు ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# పెనమలూరులో సంచలన భూ కుంభకోణం
## నకిలీ పత్రాలతో 800 గజాల స్థలం కాజేసేందుకు యత్నం.. ఐదుగురు అరెస్ట్

**పెన్ పవర్, కృష్ణాజిల్లాపెనమలూరు, సెప్టెంబర్ 26:**
పెనమలూరు మండలం కానూరు పరిధిలోని సర్వే నంబర్ 36లో జరిగిన సంచలన భూ కుంభకోణం గుట్టును పెనమలూరు పోలీసులు ఛేదించారు. నకిలీ పత్రాలు సృష్టించి 800 గజాల స్థలాన్ని కాజేసేందుకు ప్రయత్నించిన కేసులో ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ ధర్మేంద్ర తెలిపారు.
విజయవాడ కేదారేశ్వరపేటకు చెందిన బిక్కిన సుబ్బారావు దంపతులకు కానూరులో 1,600 గజాల స్థలం ఉంది. వారి కుమార్తె హిమబిందు అమెరికాలో నివసిస్తున్నారు. దీనిని ఆసరాగా చేసుకున్న విజయవాడకు చెందిన రియల్ ఎస్టేట్ ముఠా 800 గజాల స్థలాన్ని కాజేయడానికి పథకం వేసినట్లు పోలీసులు తెలిపారు.
ముందుగా స్థలానికి సంబంధించిన పత్రాల జిరాక్స్ కాపీని సంపాదించిన నిందితులు.. సుబ్బారావు దంపతులు జీవించి ఉన్నప్పటికీ వారు మృతి చెందినట్లు నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాలను జిరాక్స్ కేంద్రంలోనే తయారు చేసినట్లు పోలీసులు




గుర్తించారు. అనంతరం అమెరికాలో ఉన్న అసలు కుమార్తె హిమబిందు స్థానంలో ప్రకాశం జిల్లాకు చెందిన మరో మహిళను తీసుకొచ్చి, ఆమె పేరుతో నకిలీ కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాన్ని సృష్టించినట్లు వెల్లడించారు.
ఆ మహిళ ఆధార్ కార్డును ఉపయోగించి ఈ ఏడాది జనవరిలో మందాడి ఆదిరెడ్డి పేరుతో సాధారణ అధికార పత్రం తయారు చేసి, ఫిబ్రవరిలో స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించినట్లు పోలీసులు తెలిపారు.
అనంతరం స్థలాన్ని విక్రయించేందుకు ప్రయత్నించగా అసలు యజమాని సుబ్బారావుకు అనుమానం రావడంతో పెనమలూరు పోలీసులను ఆశ్రయించారు. దీంతో ఈ నెల 18న కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులను గుర్తించి అరెస్ట్ చేశారు.
అరెస్ట్ అయిన నిందితులు: మైనంపాటి మణికుమార్ (ప్రధాన సూత్రధారి), మందాడి ఆదిరెడ్డి, ఉప్పల భాస్కరరావు, ఆర్‌ఎంపీ శివ, కాసాని అమలేశ్వరరావు.ఈ వ్యవహారంలో మరికొందరి ప్రమేయం ఉన్నట్లు అనుమానిస్తున్నామని, దర్యాప్తు కొనసాగుతోందని డీఎస్పీ ధర్మేంద్ర తెలిపారు. కేవలం జిరాక్స్ కాపీల ఆధారంగా కోట్ల రూపాయల విలువైన స్థలాలను కాజేసేందుకు ప్రయత్నించే ముఠాల పట్ల విదేశాల్లో ఉంటున్న వారు, తమ ఆస్తులకు దూరంగా ఉంటున్న యజమానులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.పత్రికా సమావేశంలో పెనమలూరు సీఐ వెంకటనారాయణ, ఎస్సైలు సుధాకర్, సందీప్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లాలో పోలీసుల ఘన విజయం..
## తాళాలు వేసిన ఇళ్లలో దొంగతనాలు చేస్తున్న ముగ్గురు నిందితులు, ఒక రిసీవర్ అరెస్టు..

**రూ. 15 లక్షల విలువైన 362 గ్రా. బంగారు, 5.9 కేజీల వెండి ఆభరణాలు, రూ. 1.02 లక్షల నగదు స్వాధీనం..**

**చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, సెప్టెంబర్ 26 :**
ఎడ్లపాడు,నాదెండ్ల, చిలకలూరిపేట అర్బన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో తాళాలు వేసిన ఇళ్లలో దొంగతనాలు చేస్తున్న ముగ్గురు నిందితులను, ఒక రిసీవర్‌ను కలిపి మొత్తం నలుగురిని అరెస్టు చేసినట్లు పల్నాడు జిల్లా ఎస్పీ జగదీష్ అదహళ్లి (ఐపీఎస్) తెలిపారు. వారి వద్ద నుండి సుమారు 362 గ్రాముల బంగారు ఆభరణాలు, 5.9 కేజీల వెండి ఆభరణాలు, రూ. 1,02,000 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు.
ఎడ్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎడ్లపాడు గ్రామంలో జరిగిన దొంగతనం (సి ఆర్ నెంబర్ 175/2026, యు/సెక్షన్ 331(4), 305(ఏ) బిఎన్ఎస్) కేసు దర్యాప్తులో ముగ్గురు నిందితులు ఈ నేరానికి పాల్పడినట్లు,ఒక రిసీవర్‌ను గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.
నిందితుల వివరాలు: వెన్న దుర్గ దినేష్ ఏ సాయి (29), మంగళగిరి టౌన్, గుంటూరు జిల్లా (ఏ1); గుంజి యేసు రాజ (24) , ఎడ్లపాడు గ్రామం మరియు మండలం (ఏ2); షేక్ నాగూర్ బాష ఏ చోర్ బాషా (20), ఎడ్లపాడు గ్రామం మరియు మండలం (ఏ3). వీరు దొంగతనాలను వృత్తిగా ఎంచుకున్నట్లు, దొంగిలించిన సొత్తును మంగళగిరి మండలం ఆత్మకూరు గ్రామానికి చెందిన యలమద్ది నాగరాజు (ఏ4) వద్ద తాకట్టు పెట్టినట్లు పోలీసులు తెలిపారు. ఏ1 వెన్న దుర్గ దినేష్ ఏ సాయి గతంలో సుమారు 12 దొంగతనాల కేసులలో నిందితుడిగా ఉన్నట్లు, ఏ2 గుంజి యేసు రాజ కూడా దొంగతనం కేసులో జైలుకు వెళ్లి వచ్చినట్లు ఎస్పీ వెల్లడించారు.
గతంలో నిందితులకు బంగారు, వెండి వస్తువులను తాకట్టు పెట్టుకునే యలమద్ది నాగరాజు (ఏ4)తో పరిచయం ఉండగా, జైలు నుంచి విడుదల అయిన తరువాత రాత్రి సమయాలలో దొంగతనాలు చేసి



బంగారు, వెండి వస్తువులను ఏ4 ఇచ్చే విధంగా ఒప్పందం కుదుర్చుకొని ఆర్గనైజర్‌గా తయారైనట్లు పోలీసులు తెలిపారు.నిందితులు చెడు వ్యసనాలకు అలవాటు పడి తేలికగా డబ్బులు సంపాదించి జల్సాలు చేయడానికి దొంగతనాలు చేసినట్లు విచారణలో తేలిందని ఎస్పీ పేర్కొన్నారు.
ఫిర్యాది బచ్చు పార్వతి నాగ లక్ష్మీ రెండు అంతస్తుల ఇంటి గ్రౌండ్ ఫ్లోర్‌లో ఒంటరిగా నివసిస్తుండగా, ఆమె ఇద్దరు కుమారులు హైదరాబాద్ మరియు బెంగళూరులో ఉద్యోగాలు చేస్తున్నారు. 03.09.2026న హైదరాబాద్ వెళ్లే ముందు ఇంటికి తాళాలు వేసి, బంగారు, వెండి ఆభరణాలు, రూ. 2,00,000 నగదు, కెవిపి బాండ్లను ఇనుప లాకర్‌లో భద్రపరిచారు. 09.09.2026 రాత్రి ఇంటి తలుపులు, గేటు తెరిచి ఉండగా, ఫిర్యాదికి ఫోన్ ద్వారా సమాచారం అందగా, బంధువులు పరిశీలించగా గేటు, తలుపులు, బీరువాల తాళాలు పగులగొట్టి ఉండటం, ఇనుప లాకర్ కనిపించకపోవడం, ఇంట్లో వస్తువులు చిందరవందరగా ఉన్నట్లు గుర్తించారు. 10.09.2026 ఉదయం 06 గంటలకు ఫిర్యాది ఇంటికి వచ్చి పరిశీలించగా, లాకర్‌లో ఉన్న 26 రకముల సుమారు 401 గ్రాముల బంగారు ఆభరణాలు, 14 రకముల 5.442 కిలోల వెండి వస్తువులు, రూ. 2,00,000 నగదు, కెవిపి బాండ్లు దొంగిలించబడినట్లు, దొంగిలించబడిన మొత్తం ఆస్తి విలువ సుమారు రూ. 15,00,000 అయినట్లు, తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి



లోపలికి ప్రవేశించి దొంగతనం చేసినట్లు ఫిర్యాది అనుమానం వ్యక్తం చేసి స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు సి ఆర్. నెంబర్ 175/2026, యు/సెక్షన్ 331(4), 305(ఏ) బి ఎన్ ఎస్ కేసు నమోదు చేయడం జరిగింది.
పల్నాడు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నరసరావుపేట డీఎస్పీ ఎం. హనుమంతరావు పర్యవేక్షణలోచిలకలూరిపేట రూరల్ సీఐ బి. సుబ్బనాయుడు, సి ఎస్ సీఐ ఎం.వి. చరణ్ ఆధ్వర్యంలో యడ్లపాడు ఎస్సై టి. శివరామకృష్ణ, నాదెండ్ల ఎస్సై ఆర్. వెంకటేశ్వరరావు మరియు సిబ్బంది రెండు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ప్రారంభించారు.
పల్నాడు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు స్పెషల్ టీమ్ ఏర్పాటు చేసి వారి గురించి వెతుకుచుండగా, ఏ2, ఏ3, ఏ4లు నాదెండ్ల మండలం ఇడ్లపాడు అడ్డరోడ్డు వద్ద అనుమానితులుగా ఉండగా పట్టుకుని విచారించి అరెస్టు చేసి చోరీ సొత్తును స్వాధీనంచేసుకున్నారు.
ఈ దర్యాప్తులో పర్యవేక్షణ చేసిన నరసరావుపేట డీఎస్పీ ఎం. హనుమంతరావు, చిలకలూరిపేట రూరల్ సీఐ బి. సుబ్బనాయుడు, సిసిఎస్ సీఐ ఎం.వి. చరణ్, నిందితులను అరెస్టు చేయడంలో కీలక పాత్ర పోషించిన యడ్లపాడు ఎస్సై టి. శివరామకృష్ణ, నాదెండ్ల ఎస్సై ఆర్. వెంకటేశ్వరరావు మరియు పోలీసు సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి రివార్డులు అందజేశారు.

# సర్ పై ఎన్నికల సంఘం కీలక నిర్ణయం

**న్యూ ఢిల్లీ, పెన్ పవర్,, సెప్టెంబర్ 26:**
ప్రత్యేక సమగ్ర సవరణ (సర్ ) ప్రక్రియకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ ) కీలక నిర్ణయం తీసుకుంది సర్ కు సంబంధించి నోటీసులు అందుకున్న ఓటర్లు ఇకపై తప్పనిసరిగా బూత్ లెవల్ అధికారులను స్వయంగా కలవాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ఓటర్లకు మరింత సౌకర్యంగా ఉండేలా ప్రక్రియను సులభతరం చేస్తున్నట్లు తెలిపింది.
నోటీసులు అందుకున్న ఓటర్ల ఇళ్లకే బిఎల్వో లు వెళ్లి అవసరమైన వివరాలు, పత్రాలను సేకరిస్తారని సీఈసీ వెల్లడించింది. ఓటర్లు కార్యాలయాలు లేదా బీఎల్వో ల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేకుండా




ఇంటి వద్దే ప్రక్రియను పూర్తి చేసుకునే అవకాశం కల్పించింది. అంతేకాకుండా, ఓటర్లు సమర్పించే అవసరమైన డాక్యుమెంట్లను బీఎల్ వో లే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారని సీఈసీ తెలిపింది. దీంతో పత్రాల సమర్పణ, అప్‌లోడ్ విషయంలో ఓటర్లపై అదనపు భారం ఉండదని స్పష్టం చేసింది. సర్ ప్రక్రియలో భాగంగా ఓటర్ల వివరాల పరిశీలన, అర్హతకు సంబంధించిన పత్రాల ధ్రువీకరణ వంటి అంశాలను బీఎల్వో లు ఇంటింటికీ వెళ్లి చేపట్టనున్నారు. నోటీసులు అందుకున్న ఓటర్లు తమకు అందుబాటులో ఉన్న సంబంధిత పత్రాలను బీఎల్వోలకు అందిస్తే సరిపోతుందని ఎన్నికల సంఘం పేర్కొంది.ఈ నిర్ణయం ద్వారా సర్ ప్రక్రియలో ఓటర్లకు ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించడంతో పాటు, పత్రాల సమర్పణ ప్రక్రియను మరింత సులభతరం చేయాలని సీఈసీ భావిస్తోంది.

# కమ్యూనిస్టులతో దోస్తీ.. జగన్ ప్లాన్ అదేనా..?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఎప్పుడూ లేని విధంగా ఊహించని పరిణామాలు తెరపైకి వస్తున్నాయి. మొన్నటి వరకు ఒకరిపై ఒకరు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించుకున్న శత్రు శిబిరాలు, ఇప్పుడు ఒక్కతాటిపైకి వచ్చే సంకేతాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వ్యవహారశైలిలో వస్తున్న ఈ అనూహ్య మార్పులు రాజకీయ విశ్లేషకులను సైతం విస్మయానికి గురిచేస్తున్నాయి. ఇంతకాలం కమ్యూనిస్టు పార్టీలను, ముఖ్యంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణను తీవ్రంగా వ్యతిరేకించిన జగన్, ఇప్పుడు అదే వర్గంతో సాగిస్తున్న మంతనాలు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.

గతంలో ఎన్నడూ లేని విధంగా సీపీఐ నేతలు నేరుగా తాడేపల్లికి వెళ్లి జగన్‌ను కలవడం, రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులపై ఈ నెల 26న విజయవాడలో నిర్వహించబోయే తమ రౌండ్ టేబిల్ సమావేశానికి ఆహ్వానించడం కేవలం మర్యాదపూర్వక భేటీ మాత్రమే కాదనేది స్పష్టమవుతోంది. ఈ పొత్తుల పరతంత్ర వెనుక జాతీయ స్థాయి 'ఇండియా' కూటమి పెద్దల వ్యూహం ఉందన్న వాదన బలపడుతోంది. ఏపీలో ఒంటరి పోరాటం చేస్తున్న తమ పార్టీకి జాతీయ స్థాయిలో మద్దతు కూడగట్టడంతో పాటు, కాంగ్రెస్ నాయకత్వంలోని కూటమి వైపు జగన్‌ను ఆకర్షించేలా కమ్యూనిస్టులను మధ్యవర్తులుగా మారుస్తున్నారనే చర్చ జరుగుతోంది.

మరోవైపు, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో ఇప్పటివరకు సత్సంబంధాలు కొనసాగించిన జగన్.. ఇప్పుడు తన వ్యూహాన్ని పూర్తిగా మార్చుకుంటున్నట్లు కనిపిస్తోంది. రాష్ట్రంలో అధికారం కోల్పోయాక, తనపై ఉన్న కేసుల విచారణను, ఈడీ దూకుడును తట్టుకోవడానికి ఆయన ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. అయితే ఇప్పుడు కమ్యూనిస్టులతో చేతులు కలపడం ద్వారా ఢిల్లీ పెద్దలకు ఒక బలమైన సంకేతం పంపుతున్నారనే విశ్లేషణలు వెలువడుతున్నాయి. అవసరమైతే కాంగ్రెస్ కూటూమితో జతకట్టడానికి కూడా వెనుకాడబోమనే సంకేతాలు పంపి, కేంద్రంపై ఒత్తిడి తెచ్చే రాజకీయ బ్లాక్‌మెయిలింగ్ వ్యూహానికి జగన్ తెరతీశారా అనే అనుమానాలు బలపడుతున్నాయి.

ఏదేమైనప్పటికీ, ఈ రాజకీయ మార్పులు కేవలం స్వల్పకాలిక ప్రయోజనాలకే పరిమితం కాకపోవచ్చు. ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీతో ఉన్న తీవ్ర విభజనల మచ్చను, సిద్ధాంత వైరుధ్యాలను పక్కనపెట్టి జగన్ వేస్తున్న ఈ అడుగులు భవిష్యత్తులో ఎలాంటి పరిణామాలకు దారితీస్తాయో చూడాలి. ప్రస్తుతానికి బీజేపీని అప్రమత్తం చేయడానికి, జాతీయ స్థాయిలో తన ఉనికిని చాటుకోవడానికి కమ్యూనిస్టులను జగన్ ఒక ఆయుధంగా వాడుకుంటున్నట్లు స్పష్టమవుతోంది. ఈ కొత్త దోస్తీ కేవలం తాత్కాలిక రాజకీయామా లేక రాబోయే ఎన్నికల నాటికి మహా కూటమికి పునాదా అన్నది కాలమే నిర్ణయించాలి.

# రాప్తాడు స్థానిక ఎన్నికల్లో వైసీపీ పట్టెంత.. ?




**హైదరాబాద్ పెన్ పవర్:** అనంతపురంజిల్లా రాప్తాడు నియోజకవర్గంలో ఒకప్పుడు వైసీపీ ప్రభావం ఉన్నా.. ఇప్పుడు దాదాపు కనుమరుగైందన్న వాదన వినిపిస్తోంది. గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో రాప్తాడు మండల పరిషత్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ భారీ విజయాన్ని నమోదు చేసింది. రాప్తాడు మండల పరిషత్‌కు సంబంధించిన స్థానిక ఎన్నికల ఫలితాలను గమనిస్తే.. రాప్తాడు మండల పరిషత్ ప్రాంతీయ నియోజకవర్గం పరిధిలో మొత్తం 11 స్థానాలు ఉన్నాయి. వీటిలో వైసీపీ ఏకంగా 9 స్థానాలను గెలుచుకుంది.ఎన్నికైన ఈ 11 మంది సభ్యులలో ఏడుగురు మహిళలు కావడం విశేషం. ఇదిలా ఉంటే, 2024 లో జరిగిన సార్వత్రిక అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం రాప్తాడు నియోజకవర్గం నుండి టీడీపీ అభ్యర్థి పరిటాల సునీత విజయం సాధించగా, వైసీపీ అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఓటమి పాలయ్యారు. ప్రస్తుతం త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఈ ప్రాంతంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ముఖ్యంగా గత వైభవాన్ని తిరిగి సాధించేందుకు.. తోపుదుర్తి ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే మండలాల స్థాయిలో రాజకీయాల వేగం పెంచారు.నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో రాజకీయ సమీకరణాలు వేగంగా మారాయి. రాప్తాడు మండలం రాజకీయ బలాబలాలు: నియోజకవర్గ కేంద్రమైన రాప్తాడులో టీడీపీ కేడర్ బలంగా పుంజుకుంది. ఎమ్మెల్యే పరిటాల సునీత, ఆమె కుమారుడు పరిటాల శ్రీరామ్ ఇక్కడ విస్తృతంగా పర్యటిస్తూ ప్రభుత్వ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నారు. టీడీపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నారు.మరోవైపు, తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ వర్గం రైతుల విద్యుత్ సమస్యలపై నిరసనలు తెలుపుతూ కేడర్‌ను కాపాడుకునే ప్రయత్నం చేస్తోంది.రామగిరి: పరిటాల కుటుంబానికి రామగిరి ఒకప్పుడు అత్యంత బలమైన కోట. అయితే, గత కొన్నేళ్లుగా ఇక్కడ తోపుదుర్తి వర్గం కూడా గట్టి పోటీ ఇస్తోంది. ప్రస్తుత పరిస్థితిని గమనిస్తే.. ఇరువర్గాల మధ్య తరచూ స్థానిక వివాదాలు, సవాళ్లు ప్రతిసవాళ్లతో రాజకీయ వాతావరణం ఎప్పుడూ వేడెక్కి ఉంటోంది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నాయకుల పట్టు ఇక్కడ మళ్లీ పెరిగింది.కనగానపల్లి: ఈ మండలంలో గ్రామ స్థాయి రాజకీయాలు చాలా చురుగ్గా ఉంటాయి. గత ప్రభుత్వ హయాంలో వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలిచిన పలువురు ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు ప్రస్తుతం టీడీపీ వైపు మొగ్గు చూపుతున్నారు. ఆత్మకూరు: ఈ మండలంలో విద్యా, మౌలిక వసతుల కల్పన వంటి స్థానిక సమస్యలపై ఇక్కడ రాజకీయం నడుస్తోంది. ప్రభుత్వ నిధులతో ఇక్కడి పాఠశాలలు, కళాశాలల అభివృద్ధికి టీడీపీ ప్రాధాన్యత ఇస్తుండగా, ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ స్థానిక రైతాంగ సమస్యలపై గళమెత్తుతోంది.చెన్నేకొత్తపల్లి: ఈ మండలంలో ఫ్యాక్షన్ ఛాయలు, పాత రాజకీయ కక్షలు అంతర్గతంగా ప్రభావం చూపుతుంటాయి. దీంతో స్థానిక ఎన్నికల్లోనూ ఈ ప్రభావం పడే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే.. మొత్తంగా రాప్తాడులో టీడీపీ తన సత్తాను మరోసారి నిరూపించుకునే ప్రయత్నం చేస్తుండగా.. వైసీపీ నేత తోపుదుర్తి తన ప్రతిష్ఠను కాపాడుకునే ప్రయత్నంలో ఉన్నారు.

# ప్రతిష్టాత్మకంగా ఎన్నికలు తీసుకుంటున్న జనసేన



**విశాఖపట్టణం, సెప్టెంబర్ 26 పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలను జనసేనపార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు, కూటమి భాగస్వామ్య పక్షాలతో పక్కా సమన్వయం కోసం ఐదుగురు సభ్యులతో కూడిన ఒక ప్రత్యేక కమిటీని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఏర్పాటు చేశారు. ఎన్నికల వేళ గ్రౌండ్ లెవెల్‌లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పక్కా వ్యూహంతో ముందుకు వెళ్లేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారుఈ కొత్త కమిటీ ఇప్పటికే జనసేన పార్టీలో క్రియాశీలకంగా ఉన్న 14 మంది సభ్యుల ప్రధాన కమిటీతో కలిసి సంయుక్తంగా పని చేయనుంది. ఈ ఐదుగురు సభ్యుల కమిటీ రాష్ట్రవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించనుంది. వివిధ జిల్లాల్లో పార్టీ బలాబలాలు, డివిజన్లు మరియు స్థానిక సంస్థల వారీగా అభ్యర్థుల గెలుపు అవకాశాలు, పొత్తుల సమన్వయంలో ఎదురవుతున్న సవాళ్లపై లోతుగా అధ్యయనం చేసి ఈ ప్రత్యేక టీమ్ ఒక సమగ్ర నివేదికను సిద్ధం చేయనుంది.ఈ కమిటీలు క్షేత్రస్థాయి నుంచి సేకరించి సమర్పించే నివేదికల ఆధారంగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ పార్టీ సీనియర్ నేతలతో కలిసి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించనున్నారు. ఆ నివేదికల ఆధారంగానే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన అనుసరించాల్సిన రాజకీయ వ్యూహాలు, సీట్ల సర్దుబాట్లపై పవన్ కల్యాణ్ క్యాడర్‌కు దిశానిర్దేశం చేయనున్నారు. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల వేళ సీట్ల పంపకాలపై కూటమిలో అంతర్గత చర్చలు నడుస్తున్న తరుణంలో జనసేన ఈ ప్రత్యేక కమిటీని రంగంలోకి దించడం రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.స్థానిక సంస్థల ఎన్నికలు జనసేన పార్టీ నాయకత్వానికి ఒక సవాల్ గా మారాయి. ఇన్నాళ్లూ ఓపిక పట్టిన నేతలు ఎంతకాలం నుంచో ఈ ఎన్నికల కోసం కాచుక్కూర్చుని ఉన్నారు. పవన్ కల్యాణ్ పై అభిమానంతో పార్టీ జెండాను పట్టుకుని వదలకుండా పన్నెండేళ్ల నుంచి చేతబూనిన వారు ఈ ఎన్నికల్లో ఖచ్చితంగా పోటీ చేయాలని భావిస్తున్నారు. పవన్ కల్యాణ్ కూడా సీట్ల షేరింగ్ లో రాజీ పడబోమని చెప్పడం కొంత ఊరట నిచ్చే అంశమే. అయితే చివరకు సీట్ల షేరింగ్ విషయంలో పవన్ కల్యాణ్ కు పెద్ద సమస్య గా మారనుంది. సీట్ల షేరింగ్ ఎక్కువ అడిగితే వాటిని ఖచ్చితంగా గెలిపించుకోవాలి. తగ్గించుకుంటే ప్రత్యర్థులే కాకుండా సొంత పార్టీ నేతల నుంచి కూడా ప్యాకేజీ అంటూ కామెంట్స్ చేస్తారు. రాజీ పడకుండా.. రహదారి ఏంటి? అన్నదే పవన్ కల్యాణ్ ముందున్న ప్రశ్న. ఏ నిర్ణయమైనా పవన్ కల్యాణ్ కు ఈ ఎన్నికలు పెద్ద సమస్యగా మారాయని చెప్పాలి. ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు విషయంలో జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చాలా స్పష్టమైన, దూకుడు వైఖరిని ప్రదర్శిస్తున్నారు. కాకినాడలో జరిగిన పార్టీ కీలక సమావేశంలో ఆయన చేసిన వ్యాఖ్యలు కూటమి రాజకీయాల్లో పెద్ద చర్చకు దారితీశాయి.ప్రపంచ పటాలు పరిశీలించండి 2024 అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీని కూటమిలోకి తెచ్చే క్రమంలో టీడీపీ అభ్యర్థన మేరకు జనసేన సీట్లు తగ్గించుకుంది. కానీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో మళ్లీ సీట్లు తగ్గిస్తామంటే ఒప్పుకునేది లేదని పవన్ కళ్యాణ్ తేల్చి చెప్పారు. చేసిన త్యాగాలు చాలని, సీట్ల కేటాయింపులో ఎలాంటి రాజీ పడబోమని స్పష్టం చేశారు. స్నేహపూర్వక పోటీకైనా సిద్ధమని ప్రకటించడం ఇప్పుడు సరికొత్త రాజకీయాలకు తెరలేపినట్లయింది. పొత్తుల లెక్కల్లో భాగంగా ఎక్కడైనా స్థానిక నాయకత్వాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోతే, కొన్ని స్థానాల్లో స్నేహపూర్వక పోటీ కి వెడదామని క్యాడర్‌కు దిశా నిర్దేశం చేశారు. అంటే ఒకరకంగా టీడీపీకి పరోక్షంగా వార్నింగ్ ఇచ్చిన పవన్ కల్యాణ్ అదే సమయంలో స్థానికంగా కూటమి నేతల మధ్య సయోధ్యను కుదుర్చుకోవాల్సిన బాధ్యత మీదేనంటూ లోకల్ లీడర్లపై పవన్ నెట్టేయడం కూడా ఒక రకంగా చర్చకు దారి తీసింది. ఒకే వార్డులో కూటమిలోని రెండు పార్టీలు పోటీ పడాల్సి వచ్చినా వెనకడుగు వేయొద్దని కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. అదే సమయంలో కూటమి ధర్మం పాటించాలని పిలుపు నిచ్చారు. గత ఐదేళ్లలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని నిలబడిన గ్రౌండ్ లెవల్ కార్యకర్తలను, వీరమహిళలను ఈ ఎన్నికల ద్వారా బలోపేతం చేయాలనేది పవన్ ప్రధాన లక్ష్యం. 15 శాతం సీట్లు మాత్రమే జనసేనకు ఇస్తారంటూ వస్తున్న ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు.వంద శాతం స్టయిక్ రేట్ లక్ష్యంగా పనిచేయాలని పార్టీకి బలమున్న ప్రతి చోటా అభ్యర్థులను నిలబెట్టాలని, అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే స్థానిక ఎన్నికల్లో కూడా 100 శాతం విజయాల రేటును నమోదు చేయాలనే వ్యూహంతో ముందుకు వెళు తున్నారు.ఎన్నికల సన్నద్ధత, వ్యూహాల కోసం ప్రత్యేక కమిటీని నియమించారు. ప్రచార కమిటీ బాధ్యతలను మంత్రి కందుల దుర్గేష్‌కు అప్పగించారు. మీరు అన్నట్లుగానే పవన్ కళ్యాణ్ తాజా స్పీచ్‌ను బట్టి చూస్తే, స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ తన ఆత్మగౌరవాన్ని, క్యాడర్ ప్రయోజనాలను పణంగా పెట్టి సీట్ల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గే సూచనలు కనిపించడం లేదు. మరి చివరకు ఏం జరుగుతుందన్నది చూడాలి.

# ఏటీఎంలలో దుర్గమ్మ ప్రసాదం

**విజయవాడ, సెప్టెంబర్ 26 పెన్ పవర్:** రాష్ట్రంలో మొదటిసారిగా దుర్గమ్మ దేవస్థానంలో ప్రసాదం ఏటీఎంను ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తీసుకొచ్చారు. భక్తులు ప్రసాదం కౌంటర్ల వద్ద గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండే శ్రమ లేకుండా లడ్డూ ప్రసాదాన్ని పొందేందుకు ఈ ఆధునిక సాంకేతికత ఎంతో దోహదపడుతుందన్నారు దేవాదాయశాఖ కమిషనర్ శ్రీ రామచంద్ర మోహన్. ఖ్యూ× ద్వారా డిజిటల్ చెల్లింపులు జరిపి క్షణాల్లో ప్రసాదం పొందేలా రూపొందించారు. ప్రస్తుతం ట్రయల్ రన్ గా ఏర్పాటు చేశామని..పనితీరు పరిశీలించిన తర్వాత భక్తుల రద్దీ అధికంగా ఉండే ఇతర ప్రాంతాల్లోనూ మరిన్ని యంత్రాలు ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తాం అన్నారు. ఉత్సవాల రద్దీ సమయంలోనే కాదు సాధారణ రోజుల్లోనూ సులువుగా లడ్డూ ప్రసాదం పొందొచ్చన్నారు. మరోవైపు ఫేక్ పూజా టికెట్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు దేవాదాయశాఖ కమిషనర్ శ్రీ కె. రామచంద్ర మోహన్. దేవాలయ దర్శనాలు, సేవల పేరిట దళారుల ప్రమేయాన్ని ఉపేక్షించేది లేదన్నారు. విజయవాడలో ఇటీవల వెలుగుచూసిన ఫేక్ పూజా టికెట్ల వ్యవహారంపై దేవస్థానం అధికార యంత్రాంగం తక్షణమే అప్రమత్తమై పోలీసులకు ఫిర్యాదు చేసిందని, బాధ్యులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆలయ సేవలను కేవలం ప్రభుత్వం, దేవస్థానం అధికారికంగా ఏర్పాటు చేసిన వెబ్‌సైట్లు, డిజిటల్ యాప్‌లు , అధీకృత కౌంటర్ల ద్వారా మాత్రమే పొందాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని పారదర్శకంగా సేవా టికెట్లు పొందాలని, దళారులను ప్రోత్సహించవద్దన్నార.ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రుల మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని చెప్పారు దేవాదాయశాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్. రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి తరలివచ్చే లక్షలాది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నామన్నారు. సామాన్య భక్తునికే అగ్రస్థానం కల్పించే దిశగా ప్రతి విభాగం సమన్వయంతో పనిచేస్తోందని పేర్కొన్నారు. రద్దీ నియంత్రణ, క్యూలైన్ల నిర్వహణ, తాగునీరు, ప్రసాద వితరణ, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఎండ, వర్షాల బారిన పడకుండా షెడ్ల నిర్మాణం, నిరంతర పర్యవేక్షణకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చే ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా దర్శనం చేసుకుని వెళ్లేలా ప్రణాళికలు రూపొందించామని, ఉత్సవాలను విజయవంతం చేసేందుకు భక్తులందరూ అధికార యంత్రాంగానికి పూర్తి సహకారం అందించాలని కోరారు.

# అంబటి రాంబాబును వెంటాడుతున్న ఈడీ..!

**గుంటూరు సెప్టెంబర్ 26 పెన్ పవర్:**
వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏపీ మద్యం రవాణా టెండర్ల కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తును మరింత వేగవంతం చేసింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, మాజీ జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుకు ఈడీ అధికారులు నోటీసులు జారీ చేశారు. హైదరాబాద్‌లోని ఈడీ ప్రాంతీయ కార్యాలయంలో జరిగే విచారణకు హాజరు కావాలని అధికారులు ఆయనకు స్పష్టం చేశారు.మద్యం రవాణా కేసులో అంబటి రాంబాబును విచారణ సెగ గట్టిగానే వెంటాడుతోంది. ఈ వ్యవహారంలో ఈడీ అధికారులు ఇప్పటివరకు ఆయనకు రెండుసార్లు నోటీసులు జారీ చేశారు. మొదటగా సెప్టెంబర్ 18న అంబటి రాంబాబుకు తొలిసారిగా ఈడీ నోటీసులు వెళ్లాయి. సెప్టెంబర్ 24న తమ ముందు హాజరుకావాలని అధికారులు అందులో పేర్కొన్నారు. అయితే ఆ సమయంలో తాను ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నానని, పాత తేదీలతో ఉన్న నోటీసులు పంపారంటూ అంబటి రాంబాబు పేర్కొన్నారు.చట్టపరమైన సలహా తీసుకునేందుకు వీలుగా తనకు కొత్త నోటీసు ఇవ్వాలని ఆయన కోరారు. అంబటి రాంబాబు అభ్యర్థన మరియు మునుపటి గడువు ముగిసిన నేపథ్యంలో, ఈడీ అధికారులు సెప్టెంబర్ 24న మరోసారి నోటీసులు జారీ చేశారు. సెప్టెంబర్ 25న ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని అధికారులు స్పష్టం చేశారు. మద్యం డిపోల నుండి షాపులకు మద్యం రవాణా చేసే కాంట్రాక్టును దక్కించుకున్న కొంతమంది వైఎస్సార్‌సీపీ నేతలతో మాజీ మంత్రికి అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలు వచ్చాయి.ఒకవేళ విచారణ పేరిట ఈడీ కఠిన చర్యలు తీసుకోవడం గానీ, అరెస్టు చేయడం గానీ చేస్తే.. దాన్ని రాజకీయ కక్షసాధింపుగా చిత్రీకరించి విక్టిమ్ కార్డ్ ఉపయోగించాలనేది ఆయన ఆలోచనగా కనిపిస్తోంది. కేంద్రంలో ఉన్న పవర్, విచారణ సంస్థల వద్ద లభించిన దస్త్రాల ఆధారంగా చట్టపరంగా ముందుకెళ్తున్న ఈడీపై ఇలా రాజకీయ రంగు పూయడం ద్వారా కేసు తీవ్రతను తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే, రాజ్యాంగబద్ధమైన కేంద్ర దర్యాప్తు సంస్థల పనితీరును, వారి వద్ద ఉన్న పక్కా మనీ-ట్రయల్ ఆధారాలను తక్కువ అంచనా వేయడం వల్లే అంబటి ఈ తరహా గేమ్స్ ఆడుతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఆరోగ్య నెపంతో సమయం దాటవేసే రాజకీయాలు ఎంతో కాలం నిలబడవు. బ్యాంకు లావాదేవీలు, డిజిటల్ సాక్ష్యాలు, బినామీల వాంగ్మూలాలు ఇప్పటికే ఈడీ చేతిలో ఉన్నందున తప్పించుకునే ప్రయత్నాలు ఆయనకు మరిన్ని చిక్కులు తెచ్చిపెట్టే అవకాశాలు ఉన్నాయి. ఈడీ బిగించే ఆర్థిక చక్రబంధం ముందు రాజకీయ ప్రదర్శనలు, ప్రెస్ మీట్లు పనిచేయవని, చట్టబద్ధమైన ప్రక్రియకు హాజరై తన తాను చెప్పే 90 ఎంఎల్ కథలు నిరూపించుకోకపోతే టెండర్ల నిబంధనలను ఉల్లంఘించి, ప్రభుత్వం నిర్దేశించిన రవాణా రేట్లను భారీగా పెంచడం ద్వారా కోట్ల రూపాయల నిధులు దారిమళ్లాయనే కోణంలో దర్యాప్తు జరుగుతోంది. ఈ క్రమంలోనే గత కొన్ని సంవత్సరాలుగా జరిగిన వ్యక్తిగత బ్యాంక్ లావాదేవీల వివరాలు, ఆస్తుల పత్రాలతో సహా విచారణకు రావాలని ఈడీ అధికారులు అంబటి రాంబాబును ఆదేశించారు. ఇప్పటికే ఈ కేసులో పలువురు కీలక వ్యక్తులను అరెస్ట్ చేసిన ఈడీ, అంబటి రాంబాబు విచారణ ద్వారా మరిన్ని కీలక రహస్యాలను ఛేదించాలని భావిస్తోంది.

## కొత్త జెన్ జీ ఓటర్లు....మూడు కోట్ల మంది

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26, పెన్ పవర్:** కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) 2025లో 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' ప్రక్రియను ప్రారంభించినప్పటి నుంచి 18 నుంచి 28 ఏళ్ల వయస్సు గల ( కేటగిరీకి చెందిన దాదాపు 2.73 కోట్ల మంది కొత్తగా ఓటర్ల జాబితాలో చేరినట్లు అధికారులు వెల్లడించారు. వార్షిక సమగ్ర సమీక్ష నిర్వహించకపోవడం వల్ల యువ ఓటర్ల నమోదు నిలిచిపోయిందంటూ వస్తున్న కథనాల నడుమ ఈ గణాంకాలు వెలువడ్డాయి. అయితే, ఈ ప్రచారానని ఈసీ అధికారులు ఖండించారు. వార్షిక సమీక్షతో సంబంధం లేకుండా అర్హులైన పౌరులు నిరంతరం తమ పేర్లను నమోదు చేసుకునేందుకు 'సబ్‌స్క్రిప్షన్ పద్ధతి/ కంటిన్యూ అప్‌డేట్' అందుబాటులో ఉందని స్పష్టం చేశారు.ఈ 2.73 కోట్లలో తొలిసారి ఓటు హక్కు పొందిన వారితో పాటు, ఇప్పటికే అర్హత ఉండి ఇటీవల జాబితాలో చేరిన లేదా వివరాలను అప్‌డేట్ చేసుకున్న 18-28 ఏళ్ల మధ్య యువకులు కూడా ఉన్నారని తెలిపారు. "ప్రజా ప్రాతినిధ్య చట్టం 1950, సెక్షన్ 14లో 2021లో చేసిన సవరణ ప్రకారం ఓటర్ల జాబితాలో పేరు లేనివారు లేదా జనవరి 1, ఏప్రిల్ 1, జులై 1, అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండే ప్రతి పౌరుడూ ఎలాంటి సమీక్ష ప్రక్రియ కోసం వేచి చూడాల్సిన అవసరం లేకుండానే నిరంతర అప్‌డేట్ విధానం ద్వారా పేరు నమోదు చేసుకోవచ్చు. స్పెషల్ సమరీ రివిజన్ , స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ రెండూ సెక్షన్ 21(3) కింద చేపట్టే ఆప్షన్ ప్రక్రియలు మాత్రమే.

ఈ రెండింటినీ ఒకేసారి నిర్వహించాలనే చట్టబద్ధమైన నిబంధనేదీ లేదు" అని అధికారులు వివరించారు. ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 14(బీ)కి చేసిన సవరణ తర్వాత ఈ నాలుగు అర్హత తేదీలను అందుబాటులోకి తెచ్చారు. ఈ నాలుగు తేదీలలో ఏ రోజైనా 18 ఏళ్లు పూర్తి చేసుకునే పౌరులు ముందుగానే 'ఫారం 6' ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుదారుడికి అర్హత వయస్సు వచ్చే త్రైమాసికంలో ఆ దరఖాస్తును పరిశీలిస్తారు.తుది ఓటర్ల జాబితా ప్రచురణ తర్వాత కూడా నిరంతర అప్‌డేట్ ప్రక్రియ కొనసాగుతుందని, కాబట్టి తదుపరి సమీక్ష వరకు ఆగాల్సిన పనిలేదని ఎన్నికల సంఘం తెలిపింది. కొత్త ఓటరు నమోదు కోసం 'ఫారం 6'ను కేటాయించారు.బిహార్‌లోని ఎస్ఐఆర్ ప్రక్రియ తర్వాత నవంబర్ 2025లో అక్కడ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. అలాగే ఈ ఏడాది అసోం, కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, పుదుచ్చేరిలలో కూడా ఓటర్ల జాబితా సవరణ పూర్తి చేసి అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించారు. ఎస్ఐఆర్, ఎస్ఎస్ఆర్, నిరంతర అప్‌డేట్ అనేవి వేర్వేరు ప్రక్రియలని ఈసీ స్పష్టం చేసింది. ఎస్ఐఆర్ సమయంలోనూ 18-28 ఏళ్ల వయస్సు వారిలో 2.73 కోట్ల మంది కొత్తగా చేరడం యువ ఓటర్ల నమోదు ఆగిపోలేదనడానికి నిదర్శనమని అధికారులు పేర్కొన్నారు.

# షాట్‌పుట్‌లో రజతం సాధించిన తేజిందర్‌పాల్ సింగ్: గుర్వీర్-యూనస్ 1500m ఫైనల్‌కు!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆసియా క్రీడలలో భారత అథ్లెట్లు అద్భుత ప్రదర్శనలతో పతకాల పంట పండిస్తున్నారు. తాజాగా ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్లలో భారత్ మరోసారి తన సత్తా చాటింది. షాట్‌పుట్ విభాగంలో తేజిందర్‌పాల్ సింగ్ తూర్ రజత పతకం సాధించగా, స్ప్రింటర్ అనిమేష్ కుజుర్ 200 మీటర్ల ఫైనల్‌కు దూసుకెళ్లారు. అలాగే మిడిల్ డిస్టెన్స్ రన్నర్లు కూడా పతకం రేసులోకి దూసుకెళ్లారు.

**షాట్‌పుట్‌లో తేజిందర్‌పాల్ సింగ్ రజతం:**

పురుషుల షాట్‌పుట్ ఫైనల్‌లో భారత స్టార్ అథ్లెట్ తేజిందర్‌పాల్ సింగ్ తూర్ అద్భుత ప్రదర్శన కనబరిచారు. తన ఐదో ప్రయత్నంలో 20.64 మీటర్ల దూరం విసిరి రజత పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఇరాన్‌కు చెందిన మొహమ్మద్‌రెజా తయేబిసే 20.81 మీటర్ల గేమ్స్ రికార్డు త్రోతో స్వర్ణ పతకాన్ని దక్కించుకున్నారు. గతంలో 2018 జకార్తా, 2022 హాంగ్జౌ ఏషియన్ గేమ్స్‌లో వరుసగా స్వర్ణాలు గెలిచిన తూర్.. తాజాగా ఐచి-నగోయా గేమ్స్‌లో రజతం సాధించి ఆసియా వేదికపై తన ఆధిపత్యాన్ని మరోసారి చాటుకున్నాడు.

**1500 మీటర్లలో గుర్వీర్, యూనూస్ దూకుడు:**

పురుషుల 200 మీటర్ల సెమీఫైనల్-3లో భారత స్ప్రింటర్ అనిమేష్ కుజుర్ 20.81 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకుని రెండో స్థానంలో నిలవడంతో, ఫైనల్‌కు అర్హత సాధించారు. థాయ్‌లాండ్‌కు చెందిన పురిపోల్ బూన్సన్ 20.10 సెకన్లతో గేమ్స్ రికార్డు సృష్టించారు. అంతకుముందు 100 మీటర్ల ఫైనల్ రేసును కోల్పోయిన అనిమేష్, 200 మీటర్లలో అద్భుతమైన కంబ్యాక్ ఇచ్చి పతక రేసులో నిలిచారు. ఇక పురుషుల 1500 మీటర్ల ఈవెంట్‌లో భారత్‌కు మరో శుభవార్త అందగా.. హీట్-2లో గుర్వీర్ సింగ్ (3:45.79), హీట్-1లో యూనూస్ షా (3:45.77) తమ విభాగాల్లో మూడో స్థానంలో నిలిచి ఫైనల్స్‌కు దూసుకెళ్లారు. ఎల్లుండి (సోమవారం, సెప్టెంబర్ 28) ఈ పతక పోరు జరగనుంది.

**కబడ్డీలోనూ గోల్డ్ మెడల్:**

ఇదిలా ఉండగా, ఈరోజు (సెప్టెంబర్ 26, శనివారం) జరిగిన పురుషుల కబడ్డీ ఫైనల్‌లో ఇరాన్‌తో జరిగిన ఉత్కంఠ పోరులో భారత్ అద్భుతమైన కంబ్యాక్‌తో 39--34 తేడాతో గెలిచి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. తొలి అర్ధభాగంలో 17--18తో వెనుకబడినప్పటికీ, ఆ తర్వాత చెలరేగిపోయి భారత్ గోల్డ్ మెడల్‌ను సొంతం చేసుకుంది.

# తిరువనంతపురంలో రోహిత్ ఫ్యాన్స్ రచ్చ.. గ్రీన్‌ఫీల్డ్ స్టేడియం బయట 50 అడుగుల కటౌట్!



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్ వర్సెస్ వెస్టిండీస్ తొలి వన్డే మ్యాచ్‌కు వేదికైన కేరళలోని తిరువనంతపురంలో క్రికెట్ ఫీవర్ తారాస్థాయికి చేరుకుంది. గ్రీన్ ఫీల్డ్ ఇంటర్నేషనల్ స్టేడియం పరిసరాలు ప్రస్తుతం క్రికెట్ అభిమానుల కోలాహలంతో పండగ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. రేపు (సెప్టెంబర్ 27, ఆదివారం) జరగనున్న ఈ హైవోల్టేజ్ పోరు కోసం కేరళ ఫ్యాన్స్ ఘన స్వాగతం పలుకుతున్నారు. ముఖ్యంగా టీమిండియా స్టార్ ఓపెనర్, రోహిత్ శర్మపై తమ అభిమానాన్ని చాటుకుంటూ ఫ్యాన్స్ ఏర్పాటు చేసిన భారీ కటౌట్ ఇప్పుడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

**రోహిత్ శర్మ 50 అడుగుల కటౌట్:**

ఇండియా వర్సెస్ విండీస్ మ్యాచ్ నేపథ్యంలో ఆల్ కేరళ రోహిత్ శర్మ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్టేడియం బయట ఏకంగా 50 అడుగుల భారీ కటౌట్‌ను ఏర్పాటు చేశారు. అయితే కేరళ గడ్డపై రోహిత్ కు ఉన్న క్రేజ్ ఏపాటిదో ఈ కటౌట్ తో మరోసారి నిరూపించింది. తిరువనంతపురానికి తరలివస్తున్న క్రికెట్ లవర్స్, అభిమానులు ఈ భారీ కటౌట్ ఎదుట ఆగి

పండగ వాతావరణంలో గ్రీన్ ఫీల్డ్ స్టేడియం:

కేరళలో ఇంటర్నేషనల్ మ్యాచ్‌లు జరిగినప్పుడల్లా అభిమానులు భారీ బ్యానర్లు, కటౌట్లతో తమ అభిమాత్వాన్ని చాటుకోవడం ఆనవాయితీగా వస్తోంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ లాంటి దిగ్గజాలు తిరిగి వన్డే జట్టులోకి అడుగు పెడుతుండటంతో ఈ మ్యాచ్‌పై అంచనాలు తారాస్థాయికి చేరాయి. స్టేడియం బయట కనిపిస్తున్న ఈ కోలాహలం, అభిమానుల కేరింతలు మ్యాచ్‌లోని ఉత్సాహాన్ని మరింత పెంచుతున్నాయి. ఇరు జట్ల మధ్య రసవత్తర పోరుకు రంగం సిద్ధంకావడంతో తిరువనంతపురం క్రికెట్ మాయాజాలంలో మునిగిపోయింది.

# ఆసియా క్రీడలు: కబడ్డీలో భారత్ డబుల్ గోల్డ్.. ఇరాన్‌ను ఓడించి పురుషుల జట్టు స్వర్ణం కైవసం

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆసియా క్రీడల్లో భారత కబడ్డీ జట్లు స్వర్ణ పతకాలతో మెరిశాయి. నేడు జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్స్‌లో పురుషుల, మహిళల జట్లు రెండూ ఇరాన్‌ను ఓడించి తమ టైటిళ్లను విజయవంతంగా నిలబెట్టుకున్నాయి. దీంతో భారత కబడ్డీ ఒకే రోజు రెండు స్వర్ణాలను ఖాతాలో వేసుకుని సంబరాలు చేసుకుంది. పురుషుల ఫైనల్ ఆద్యంతం హోరాహోరీగా సాగింది. భారత జట్టు 40-34 తేడాతో ఇరాన్‌పై విజయం సాధించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. ఒక దశలో ఇరు జట్ల స్కోర్లు 20-20తో సమంగా నిలిచాయంటే పోరు ఎంత తీవ్రంగా సాగిందో అర్థం చేసుకోవచ్చు. అయితే, కీలక సమయంలో పుంజుకున్న భారత క్రీడాకారులు ఇరాన్‌పై పైచేయి సాధించి విజయాన్ని అందుకున్నారు. వరుసగా ఏడుసార్లు స్వర్ణాలు గెలిచిన భారత పురుషుల జట్టు, 2018 జకార్తా గేమ్స్‌లో ఇరాన్ చేతిలో ఓడి నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది. అయితే, ఆ తర్వాత పుంజుకుని 2023లో టైటిల్ గెలిచి, ఇప్పుడు దాన్ని నిలబెట్టుకుని మరోసారి తమ ఆధిపత్యాన్ని నిరూపించుకుంది. అంతకుముందు జరిగిన మహిళల ఫైనల్‌లో కూడా భారత జట్టు అద్భుత ప్రదర్శన కనబరిచింది. ఇరాన్‌పై 37-34 తేడాతో గెలిచి స్వర్ణం కైవసం చేసుకుంది. దీంతో రెండు విభాగాల్లోనూ ఇరాన్‌ను ఓడించి భారత్ డబుల్ గోల్డ్ సాధించినట్టయింది.



# నచ్చకపోయినా కొన్నిసార్లు రాజీ పడక తప్పదు!

గ్లామర్ ప్రపంచంలో వెలిగిపోయే తారల జీవితాలు బయట నుంచి రంగులమయంగా కనిపించినా? దాని వెనుక అనేక ఆర్థిక సవాళ్లు, వృత్తిపరమైన రాజీలు దాగి ఉంటాయనేది పచ్చి నిజం. మనకు నచ్చకపోయినా కొన్నిసార్లు పరిస్థితిని బట్టి రాజీ పడక తప్పదు అంటూ బాలీవుడ్ నటి ఫాతిమా సనా షేక్ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. తెరపై ఎన్ని వైవిధ్యమైన పాత్రలు పోషించినా? సినీ పరిశ్రమలోని ఆర్థిక వాస్తవాలు, పరిమితుల వల్ల నటీనటులు ఏమాత్రం ఇష్టం లేని ప్రాజెక్టులను కూడా చేయాల్సి వస్తుందని నిర్మొహమాటంగా వెల్లడించారు.



తమకంటూ సొంత ప్రాధాన్యతలు, కళాత్మక అభిరుచులు ఉన్నప్పటికీ జీవనోపాధి కోసమే నచ్చని పాత్రలను అంగీకరించాల్సి వస్తుందని ఫాతిమా ఓపెన్‌గా చెప్పారు. -మేము సంపన్న కుటుంబాల నుంచి రాలేదు. ప్రతి ఒక్కరికీ డబ్బు అవసరం ఉంటుంది. కేవలం నటులమే తప్ప సినిమాలకు కోట్లు ఖర్చుపెట్టే నిర్మాతులం కాదు- అంటూ సినీ రంగానికి సంబంధించిన ఆర్థిక చేదు నిజాలను బయటపెట్టారు. చేతిలో ఉన్న తక్కువ





అవకాశాల్లోనే ఉత్తమమైనదాన్ని ఎంచుకుంటూ ముందడుగు వేయక తప్పదని, పరిశ్రమలో టైమింగ్ వరుస విజయాలే అవకాశాల సంఖ్యను నిర్ణయిస్తాయన్నారు. హిందీ చిత్ర పరిశ్రమలో మహిళా నటీమణులకు లభించే పాత్రల పరిమితుల గురించి కూడా ఫాతిమా తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పురుష నటులకు నటనలోని పూర్తి స్థాయి నైపుణ్యాన్ని చూపించడానికి అనేక అవకాశాలు దక్కుతాయని, కానీ మహిళల విషయానికి వచ్చేసరికి లోతైన, విభిన్నమైన కోణాలున్న పాత్రలు చాలా అరుదుగా లభిస్తాయన్నారు. సినిమా అనేది సమాజానికి ప్రతిబింబమని పేర్కొంటూ సమాజంలో ఉన్నట్లే సినిమాల్లోనూ లింగ ఆధారిత పాత్రల పరిమితులు స్పష్టంగా ఉంటాయని విశ్లేషించారు.

సినిమాల్లో మహిళా పాత్రలను చిత్రీకరించే తీరుపై మాట్లాడిన ఫాతిమా నెగెటివ్ లేదా కాంప్లెక్స్ ఛాయలున్న పాత్రల విషయంలో పరిశ్రమ ఇంకా పాత మూస ధోరణుల్లోనే ఉండిపోయిందని అభిప్రాయపడ్డారు. పురుషులకు లభించినట్లుగా సంక్లిష్టమైన, గందరగోళంతో కూడిన సాధారణ మహిళా పాత్రలను హుందాగా చూపించే స్థాయికి బాలీవుడ్ ఇంకా చేరుకోలేదన్నారు. నలుపు-తెలుపుల మధ్య ఉండే సాధారణ మానవ స్వభావాన్ని మహిళా పాత్రల్లో ఆవిష్కరించే ప్రయత్నాలు మరింత ఎక్కువగా జరగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఫాతిమా షనా షేక్ తాజా ప్రాజెక్టు విషయానికి వస్తే జియోహాట్‌స్టార్‌లో ప్రసారమవుతున్న -హుంకార్-వెబ్ సిరీస్‌లో ఫాతిమా ఏసీపీ జస్లీన్ సింగ్ సోయిన్ అనే పవర్‌ఫుల్ పోలీసు ఆఫీసర్‌గా నటించారు. ఒక ఆధ్యాత్మిక గురువుపై పాఠశాల విద్యార్థిని చేసే లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో సిరీస్ కథాంశం సాగుతుంది. ఈ కేసును నిర్భయంగా దర్యాప్తు చేసే పోలీస్ అధికారిగా ఫాతిమా నటనకు విశేష ప్రశంసలు దక్కుతున్నాయి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at Dno 6-5-25, medara bazar, 16 th ward, near Oid bus stand, Bapatla editor GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2233, editorpenpower@gmail.com